

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ మంగళవారం 16-2-2021 RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 168 పేజీలు: 4 వెల: రూ.1/-


# సీఎం కేసీఆర్ జన్మదినం కానుకగా గ్రీన్ ఛాలెంజ్

**ప్రతీ గ్రామానికి వెయ్యి మొక్కల చొప్పున నాటే లక్ష్యం**
**హరిత సంకల్పం కృషికి వనమాలి బిరుదులు**
**గ్రామ పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు**
**జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**
**ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపి సింతోష్ పిలుపు**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 17న కోటి వృక్షార్చన కార్యక్రమం తీసుకున్నట్లు ఎంపి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ రోజు ఒక్క గంటలో కోటి మొక్కలు నాటి రికార్డు సృష్టించి, కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలనేది గ్రీన్ ఇండియా చాలెంజ్ సంకల్పం అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను అభిమానించే వారితో పాటు వ్యాపార, వాణిజ్య, సినిమా, పారిశ్రామిక రంగ ప్రముఖులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. కాగా, కోటి వృక్షార్చన కార్యక్రమానికి అండగా ఉందా మని ప్రిన్స్ మహేష్‌బాబు అన్నారు. తన కూతురు సితార, కొడుకు గౌతమ్ తనతో పాటు మొక్కలు నాటుతున్న వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ చాలెంజ్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఈనెల 17న కోటి వృక్షార్చన కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే గ్రీన్ చాలెంజ్‌కు సంబంధించిన విధి విధానా లను జిల్లా పంచాయతీ, అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత రెండు రోజుల క్రితమే రాష్ట్రస్థాయి అధికారులు సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రీన్ చాలెంజ్‌పై సమీక్షించారు. ప్రతీ ఒక్కరు మూడు మొక్కలను నాటే విధంగా చర్యలు



తీసు కోనున్నారు. నర్సరీలలో గ్రీన్ చాలెంజ్‌కు అవసరమైన మొక్కలు లేకపోవడంతో అటవీ శాఖ నిర్వహిస్తు న్న నర్సరీల నుంచి మొక్కలను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ గ్రామానికి వెయ్యి మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుం టున్నారు. కనీసం మూడు సెంటీమీటర్ల ఎత్తులో ఉన్న మొక్కలను మాత్రమే నాటాలని సూచిస్తున్నారు. గ్రామ నర్సరీలలో మొక్కలు అందుబాటులో లేకపోతే ఇతర నర్సరీల నుంచి మొక్కలను తీసుకొచ్చి అందు బాటులో ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. మొక్కలు నాటే స్థలాలను ఎంపిక చేసి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీల అధికారులకు సూచిస్తున్నారు. కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రతీఒక్కరు మూడు మొక్కలను నాటిన ఫొటోలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వారం రోజుల తర్వాత పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి వనమాలి బిరుదులను ప్రకటిస్తారు. 'ఒక రోజులో.. ఒక గంట.. ఒక కోటి మొక్కలు' అనే నినాదంతో చేపడుతున్న గ్రీన్ చాలెంజ్ కార్యక్ర మాన్ని ఈ నెల 17న ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు చేపట్టనున్నారు. హరిత సంకల్పానికి కృషి చేసిన వారికి ప్రభుత్వం వనమాలి బిరుదులకు ఎంపిక చేయనుంది. ఈ బిరుదులను అందుకున్న వారికి ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యతను కల్పించనున్నారు. జిల్లాలవ్యాప్తంగా మొక్కలు నాటే స్థలాల గుర్తింపును పూర్తి చేశారు. అన్ని మొక్కలు ఒకే చోట కాకుండా గ్రామంలో ఎంపిక చేసిన నాలుగైదు స్థలా ల్లో నాటాల్సి ఉంటుంది. నాటిన మొక్కలను తప్పనిసరిగా సంరక్షించే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రత్యేక సమావేశాలలో గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలాల వారీగా ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శు లతో పాటు సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులతో పాటు జిల్లాస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రీన్ చాలెంజ్‌పై సమీక్షించారు. ప్రతీ సర్పంచ్ తప్పనిసరిగా ఒక్క మొక్కనైనా నాటాల్సి ఉంటుంది. గ్రామాల్లో సర్పంచ్‌లే ఈ కార్యక్రమానికి పూర్తి బాధ్యత వహించాలి.

# లోక్‌సత్తా శ్రీనివాస్ కన్నుమూత

**కరోనా చికిత్స పొందుతూ మృతి**
**కుటుంబ సభ్యులను పరామర్శించిన బండి సంజయ్**
**పలువురు ప్రముఖుల సంతాపం**
**ఉద్యమ సహచరుడి మృతిపై జయప్రకాశ్ దిగ్భ్రాంతి**

కరీంనగర్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత, లోక్‌సత్తా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కన్నుమూశారు. కరోనాతో బాధపడ్తున్న ఆయన కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయంచనిపోయారు. నరెడ్ల శ్రీనివాస్ మృతి పట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాస్పిటల్‌కు వెళ్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. లోక్‌సత్తా శ్రీనివాస్‌గా కరీంనగర్ జిల్లాలో సుపరిచితులయ్యారు నరెడ్ల శ్రీనివాస్. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ఆయనకు పేదల పక్షపాతిగా పేరుంది. దాదాపు 70 ఏళ్ల వయస్సులోనూ ఎంతో యాక్టివ్‌గా సమాజాన్ని అధ్యయనం చేస్తుండేవారు. ప్రభుత్వ పాలసీలు, ప్రజా సమస్యలపై చర్చాగోష్టులు నిర్వహించేవారు. యూనియన్ బ్యాంకులో బ్యాంకులో క్లర్క్‌గా కెరీర్ ప్రారంభించిన శ్రీనివాస్.. మేనేజర్ గా రిటైరయ్యారు. రిటైర్మెంట్‌కు ముందే జయప్రకాశ్ నారాయణ స్థాపించిన లోక్ సత్తాలో శ్రీనివాస్ భాగస్వాములయ్యారు. ఎన్నో సామాజిక అంశాలపై పోరాటాలు చేశారు. వినియోగదారులకు జరిగే మోసాలపై పోరాటాలతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను, అన్యాయాలను సమాచార హక్కు చట్టం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచారు. మాజీ ఏఎస్ఐ మోహన్ రెడ్డి బాధితుల తరపున చివరి వరకు పోరాటం సాగించారు. బొమ్మకల్ భూ అక్రమణల వ్యవహారాన్ని బయటకు తీశారు. ఫేక్ డాక్టరేట్ పట్టాల బాగోతాన్ని బయటపెట్టారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా, సంస్థ అధ్యక్షునిగా పలు దఫాలు పనిచేసిన శ్రీనివాస్.. సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. శ్రీనివాస్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం తెలిపారు. సహచరుడిని కోల్పోయానని లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మృతి కరీంనగర్ జిల్లాలో లోక్‌సత్తా, వినియోగదారుల ఉద్యమాలకు తీరని లోటు అన్నారు.

# గిరిజన రిజర్వేషన్లపై తేల్చని కేంద్రం

**ఆత్మగౌరవం పెంచేలా సంత్ సేవాలాల్ జయంతి**
**తెలంగాణ భవన్ ఉత్సవాల్లో మంత్రి తలసాని**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): గిరిజన రిజర్వేషన్లు పెంచాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేశారని, అయితే కేంద్రప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అనుమతి రాలేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచేలా సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు జరపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు. ఇందులో బాగంగా సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. గిరిజనులపై బీజేపీ కపట ప్రేమ కనబరుస్తోందని పేర్కొన్నారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచేలా సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తలసాని తెలిపారు. గతపాలకులు గిరిజనులను నిర్లక్ష్యం చేశారని వారి సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని తలసాని పేర్కొన్నారు. గతపాలకుల హయాంలో గిరిజనులు నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక గిరిజనుల



అభివృద్ధికి కృషిచేస్తున్నామని అన్నారు. త్వరలో పోడు భూముల సమస్య పరిష్కారం అవుతుందని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దని తెలిపారు. రాష్ట్రంలో గిరిజనుల చదువులకు గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా సేవాలాల్ జయంతిని పండుగలా జరుపుకుంటున్నామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గిరిజన బిడ్డలు సంతోషంగా ఉండటానికి సీఎం కేసీఆర్ కారణమన్నారు. అన్ని రంగాల్లో గిరిజనులకు ప్రాధాన్యం ఇచ్చారని వెల్లడించారు. గిరిజన బిడ్డ సత్యవతి రాథోడ్‌కు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని తెలిపారు. సేవాలాల్ జయంతి, నాగోబా గిరిజన జాతరకు రూ.కోటి చొప్పున ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. గిరిజనులు తమ తండాను తావే పరిపాలించుకునే అవకాశం కల్పించిందని మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. గిరిజన మహిళకు మంత్రివర్గంలో చోటు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. గతపాలకులు గిరిజనులను నిర్లక్ష్యం చేశారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక గిరిజనుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మల్లారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజనుల చదువులకు గురుకులాలు ఏర్పాటు చేశామని మల్లారెడ్డి తెలిపారు.

# నాగోబాను దర్శించుకున్న హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ మండలంలో నాగోబా జాతరలో పాల్గొన్న హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపి సోయం బాపురావు దత్తాత్రేయ

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ మండలంలో నాగోబా జాతర వైభవంగా కొనసాగుతున్నది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగోబాను దర్శించుకుంటున్నారు. సోమవారం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు పలువురు ప్రముఖులు నాగోబా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావు దత్తాత్రేయకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో దత్తన్న నాగోబాకు ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రజలాంతా క్షేమంగా ఉండాలని నాగోబాకు మొక్కుకున్నట్లు తెలిపారు. గిరిజనుల సాధికారత కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాలని సూచించారు. ఏజెన్సీలో 1/70 చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని, విద్య, వైద్యం, మౌలిక వసతులు మెరుగుపర్చాలని అన్నారు. ప్రముఖుల పర్యటన నేపథ్యంలో నాగోబా ఆలయం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# నగరంలో చిరుత..అడవి పులి

**భయాందోళనల్లో ప్రజలు**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): నగరంలో మరోసారి చిరుతపులి కలకలం సృష్టించింది. రాజేంద్రనగర్ లోని వాలంతరి రైస్ రిసెర్చ్ సెంటర్ వద్ద చిరుత సంచరించింది. ఆదివారం రాత్రి రెండు లేగ దూడలపై దాడిచేసింది. అయితే కుక్కలు వెంటపడటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. స్థానికులు ఈ విషయాన్ని గురించి పోలీసులు, అటవీ శాఖ సిబ్బందికి తెలియజేశారు. గతంలో ఆవు దూడను చంపిన ప్రాంతంలోనే చిరుత సంచరించింది. మరోవైపు కొమ్రంభీం జిల్లాలోని బెజ్జూరు మండలంలో మరోసారి పెద్దపులి కలకలం రేపింది. బెజ్జూరులో సోమవారం తెల్లవారుజామున పెద్దపులి సంచరించింది. కుకడ అటవీ ప్రాంతంలో ఓ పశువును చంపింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. తెల్లవారుజామున కుకుడ అటవీ ప్రాంతంలో పెద్దపులి ఆవుపై దాడి చేసింది. పులి దాడిలో ఆవు మృతి చెందింది. పెద్దపులి ఆవుపై దాడి చేయడంతో అక్కడి గ్రామస్తులు భయాందోళనకు గురౌవుతున్నారు. పంట పొలాలకు వెళ్లాలి అంటే స్థానికులు జంకుతున్నారు. ఇంటి నుంచి పరిసర ప్రాంతాలకు వెళ్లాలి అన్న స్థానికులు భయభ్రాంతులకు గురైతున్నారు. పెద్దపులి సంచరిస్తోందని కుకడ గ్రామ పెద్దలు అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఈనేపథ్యంలో ప్రజలు ఒంటరిగా అడవిలోకి వెళ్లకూడదని పోలీసులు, అటవీ అధికారులు సూచించారు. అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

**హైదరాబాద్‌కు రామచంద్ర రావు..వరంగల్‌కు గుజ్జుల**
**అధికారికంగా ప్రకటించిన బిజెపి**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆయా పార్టీలు పోటీరికి రంగం సిద్ధం చేస్తున్నాయి. మార్చి 14న మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రస్తుత ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పేరును, వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈ మేరకు వీరిద్దరి పేర్లను బీజేపీ నాయకత్వం అధికారికంగా ప్రకటించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్ రామచంద్రరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డిల పదవీకాలం మార్చి 29తో ముగియ నుంది. ఈ ఎన్నికలతోపాటే ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల టీచర్స్ నియోజకవర్గాలకు కూడా ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ తెలిపింది.



వరంగల్ స్థానానికి టిఆర్ఎస్ ఇప్పటికే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేరును ఖరారు చేసింది. హైదరాబాద్‌కు ఖరారు చేయాల్సి ఉంది. ఇదిలావుంటే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు సాగర్ ఉప ఎన్నికపై బిజెపి దృష్టి సారించింది. త్వరలో నాగార్జునసాగర్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. బీజేపీ జాతీయ నేతలు సభకు హాజరుకానున్నారు. ముఖ్యంగా లంబాడి ఓట్లపై కమలనాథులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉప ఎన్నిక ముందు లంబాడి కీలక నేత బీజేపీలో చేరనున్నారు. సాగర్‌లో ఇప్పటికే ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయిలో పని మెదలు పెట్టింది. ప్రతి 50 ఓట్లకు బీజేపీ ఒక ప్రతినిధిని పెట్టింది. గుర్రంపోడు అరెస్టులను బీజేపీ సీరియస్‌గా తీసుకుంది. మరోసారి గుర్రంపోడు వెళ్లేందుకు బండి సంజయ్ సిద్ధమవుతున్నారు.

# సీసీకెమెరాలతో త్వరగా కేసుల పరిష్కారం

**నిందితుల పట్టివేతలో తోడ్పడుతున్న దృశ్యాలు**
**శాంతి భద్రతల పరిరక్షణలోనూ ముఖ్య భూమిక**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని డీజీపీ మహేందర్ రెడ్డి కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించగలిగినామని మహేందర్ రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమెరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొం దేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందు కు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది. కేసులను ఛేదించడం లో ఇవి ఎంతగానో తోడ్పడ్డాయి. బి ఫార్మసీ విద్యా ర్థి కిడ్నాప్ వ్యవహారంలో కూడా ఇవి బాగా ఉపకరించాయి. అలాగే గతంలో అనేకానేక కేసులను సిసి కెమెరాల ద్వారా పరిష్కరించారు.

## చరిత్రలో నేటినిజం



కం|| ప్రబలమ్మగు సాధనతో
సబలాంబుల్ముట్టి పడక సుస్థలిపై
కబడీ "ప్రదీపు నర్వాలు"
శబలతతో ఆటలాడి జయముల నొందెన్!!

-రాధశ్రీ

సెల్: 9494481210



(ఫిబ్రవరి 15 కబడ్డీలో జాతీయస్థాయి అవార్డులు పొందిన ప్రదీప్ నర్వాలు జననం..)

# హైదర్‌గూడాలో అగ్నిప్రమాదం

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్): నగరంలోని హైదర్‌గూడలో అగ్నిప్రమాదం జరిగింది. ఓ భవన సముదాయంలోని మూడో అంతస్తులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూటే అగ్ని ప్రమాదానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. ఆస్తినష్టం వివరాలు తెలియరాలేదు. మంటలు అదుపులోకి వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో షర్మిల వరుస భేటీలు

**షర్మిలతో భేటీ అయిన మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి**

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కొత్త పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్న వైఎస్ షర్మిల.. వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం బెంగుళూరు నుంచి ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. తాజాగా సోమవారం మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి షర్మిలను కలిశారు. వైఎస్ఆర్ హయాంలో, కిరణ్‌కుమార్ రెడ్డి సమయంలో.. ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయన.. షర్మిలతో చర్చలు జరపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక, సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన రంగారెడ్డి.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మీద ఉన్న అభిమానంతో షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశానన్నారు.. షర్మిలపై కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు.. ఇది సరికాదని హితవు పలికిన ఆయన.. వైఎస్ చనిపోయినా వారి పిల్లలు ప్రజల కోసం మంచి పనులు చేస్తున్నారు.. ఇది అభినందనీయం అన్నారు. మహిళలను ప్రోత్సహించాలి, గౌరవించాలన్నారు. ఇక, లక్షలా మంది ప్రజాప్రతినిధులను వైఎస్ తయారు చేశారు.. వైఎస్ కుటుంబ సభ్యులు కూడా తెలంగాణ ప్రాంతానికి ఎన్నో మంచి పనులు చేశారని.. ఔటర్ రింగ్ రోడ్డువంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని రంగారెడ్డి గుర్తుచేశారు. వైఎస్ షర్మిలపై ఆవాకులు చెవాకులు మాట్లాడొద్దని మా పార్టీ నేతలకు సూచిస్తున్నాన్న ఈ కాంగ్రెస్ నేత, నిజాయితీ పనులు చేసే వారిని అభినందించాలన్నారు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉన్నప్పుడు నాయకులు కాళ్లు, ఏళ్లు పట్టుకుని తిరిగి.. ఇప్పుడు ఆయన్ని విమర్శించం గొప్ప కాదని మండిపడ్డారు.మరోవైపు పార్టీ ఆవిష్కరణకు రెండు తేదీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మే 14న షర్మిల పార్టీ ఆవిష్కరణ?.. లేదా జూలై 8న ఆవిష్కరించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.గతంలో మే 14న ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మే 14నే పార్టీ జెండా అజెండా ప్రారంభిస్తే పాదయాత్ర లకు వెళ్లొచ్చని ముఖ్య నేతలు షర్మిలకు సూచించినట్లు సమాచారం. జూలై 8న రాజశేఖర్ రెడ్డి జయంతి కావడంతో ఆ రోజును షర్మిల సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. అయితే జూలై 8 నాటికి ఆలస్యం అవుతుందని ముఖ్యనేతలు చెబుతున్నట్లు తెలియవచ్చింది. కాగా రెండు తేదీల్లో ఒకదానిని ఫైనల్ చేసే ఆలోచనలో షర్మిల ఉన్నట్లు సమాచారం.

# ఎమ్మెల్సీ ఎన్నికల అధికారులతో బల్దియా కమిషనర్ సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 15: మహబూబ్ నగర్ - రంగారెడ్డి- హైదరాబాద్ పట్టాభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణపై జీహెచ్‌ఎంసీ ఎన్నికల అధికారి, కమిషనర్ డీఎస్ లోకేశ్ కుమార్ ఎన్నికల నోడల్ అధికారులతో ఇవాళ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ లోకేశ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టాభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 5.60 లక్షల మంది ఓటర్లున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 169 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎల్బీ స్టేడియంలోని ఇండోర్ స్టేడియాన్ని తాత్కాలికంగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ప్రియాంక అలాను రిటర్నింగ్ అధికారిగా నియమించినట్లు ఆయన తెలిపారు. నామినేషన్లను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం 3వ అంతస్తులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు, 80 ఏండ్లు నిండిన వృద్ధులు, కొవిడ్ రోగుల వద్దకే ఎన్నికల సిబ్బంది వెళ్లి ఓట్లు వేయిస్తారని స్పష్టం చేశారు.

# ధాన్యం సేకరణపై జాతీయ విధానాలు ఏవీ ?

నేటినిజం
మంగళవారం 16-2-2021

దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలా కొనుగోలు చేసి... వాటిని ప్రజలకుచేర్చాలన్న విధానాలూ లేవు. సాగుచట్టాలపై ఉన్న శ్రద్ద పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానం, ఆహార పంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. ఇకపోతే తాజాగా కందుల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు స్పష్టత లేదు. మార్క్‌ఫెడ్ ఇంకా రంగంలోకి దిగలేదు. ఇప్పటికే రైతులు పంటను అమ్మడానికి సిద్దం చేశారు. ఓవైపు కందిపప్పు ధరలు అమాంతంగా పెరుగుతున్నా.. కందులకు మాత్రం ధరలు రావడం లేదు. మార్కెట్‌లో సామాన్యులకు పప్పుల ధరలు అందనంతగా పెరిగాయి. సాగుచట్టాలను బలవంతగా రుద్దిన కేంద్రం ..పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానాలను నేటికీ రూపొందించలేదు. బడ్జెట్‌లో కూడా ఇలాంటి ప్రతిపాదనలు లేవు. బ్యాంకులను ముంచినోళ్లను..కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసు కుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించ లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో కందులు, మిర్చి తదితర పంటలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ దశలో వారివద్దనుంచి పంటలను కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలి. వారిని ఆదుకునేందుకు ఎంత సాయం చేసినా దేశ అభివృద్దికి పునాది పడినట్లే. రైతుల్లో నైరాశ్యం నెలకొంటే దేశానికే ప్రమాదం. ఇది గమనించని పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయం భారంగా మారుతోంది. పంటలు పండించిన రైతులను ఆదుకునేందుకు కేవలం పంటలను మద్దతు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని ఏటా ఆందోళనలు చేస్తున్నా, రోడ్డెక్కుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. తమ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలకు దిగడం పరిపాటే అన్న ధోరణిలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. గతంలో ఎర్రజొన్న ,పసుపు రైతుల ఆందోళనలు చూశాం. ఇప్పుడు మళ్లీ కంది రైతులు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితులు దాపురించాయి. మొన్నటికి మొన్న పసుపు, మిర్చి,పత్తి రైతుల ఆందోళనలు చేపట్టారు. మార్కెట్లో కంద పప్పుల ధరలు పెరుగుతున్నా పండిన పంటను ప్రజలకుచేరువ చేయడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. ఇలాంటి ఆందోళనలు లేకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించడం లేదు. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు ఉన్నా లాభం లేదన్న పరిస్థితి ఏర్పడింది. సిసిఐ, మార్క్‌ఫెడ్ లాంటి సంస్థలు ఉన్నా న్యాయం జరగడం లేదు. ఇలా ఎంతకాలం రైతులు పంటలు అమ్ముకోవడానికి ఆందోళన లకు దిగాలో పాలకులు చెప్పాలి. గతేడాది నారాయణపేట, సిద్దిపేట జిల్లాల్లో రైతులు ఆందోళనకు దిగారు. కందులు కొంటామని మార్క్‌ఫెడ్ అధికారులు టోకెన్లు ఇచ్చి చేతులెత్తేయడంతో రాస్తారోకో చేశారు. దాంతో కందులు కొంటామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే గతానుభవాలు దృష్టిలో పెట్టుకుని అయినా ప్రభుత్వాలు పటిష్ట మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం లేదు. గతేడాది వివిధ ప్రాంతాల్లో చేసిన ఆందోళనలు ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. ఏటా పత్తి, మిర్చి, ఎర్రజొన్న, కంది రైతులు ఆందోళనలు సర్వసాధారణమై పోయాయి. వీటిని గర్తించి ప్రభుత్వాలు జాగ్రత్త పడాలి. దేశంలో కనుక రైతులు అలిగి... ఈ దండగమారి వ్యవసాయం మన కెందుకులే అని అనుకుంటే ఏమవుతుందో పాలకులు ఆలోచించాలి. నష్టాలతో సేద్యం చేయడమెందు కని కాడి పడేస్తే ఏమవుతుందో అని ఆలోచన చేయాలి. అలా అన్నదాత ఆలోచిస్తే నోట్లోకి ముద్ద దిగదని గుర్తుంచుకోవాలి. అందరిలాగే తానూ ఏదో పట్నం వెళ్లి

పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించు కుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి. నోట్లోకి ముద్ద దిగేదెలా.. తలచుకుంటేనే భయం వేస్తుంది. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే... అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం..పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొను గోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు.అందుకు అవసరమైన వాతావరణం సృష్టించాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి.వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భావన కలిగించాలి. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు మేలుచేసేవిగా ఉన్నా..పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు నైరాశ్యం లేకుండా చేయగలగాలి. తెచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలంబించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్కగలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ము కోలేక పోతున్నారు. రైతు అలిగితే మంచిది కాదని తెలుసుకోవాలి. పాలకులు అన్నవారు ఇలాంటి ఆలోచనే చేయాలన్న విధంగా ,ఆర్థికంగా అండగా నిలవాలన్న విధంగా కార్యక్రమాలు చేయాలి. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా పుంజుకుంటుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. ఆలా చేయనంత కాలం భారత అన్నదాతల తలరాత మారదు.

## మొక్కలను నాటి కెసిఆర్‌కు కానుకగా ఇవ్వాలి: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): గ్రామాల సమగ్రాభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలని, అందుకు తనవంతుగా కృషి చేస్తానని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ పథకాలతో సర్పంచ్‌లు గ్రామాల్లో మంచి పాలన అందించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయనున్నట్లు తెలిపారు. కెసిఆర్ బర్త్‌డేను పురస్కరించుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరిసేందుకు ఇదొక్కటే మార్గమని అన్నారు. మొక్కలను నాటి కెసిఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతి గ్రామ పంచాయతీకి బీటీ రోడ్డు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి గ్రామ పంచాయతీకి రూ.16లక్షలతో పంచాయతీ భవనాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రూ.10లక్షలు శ్మశాన వాటికల నిర్మాణానికి మంజూరు చేస్తామని ప్రకటించారు. మండలంలో ప్రతి నిరుపేదకు డబుల్‌బెడ్రూం మంజూరు చేస్తామని, మార్చి నెల చివరి వరకు ఇంటింటికి తాగు నీరు అందిస్తామన్నారు.

## పోలీస్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటి సంక్షేమ పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయి

### నేటితో 20 ఏళ్ళు పూర్తిచేసుకున్న పోలీస్‌సొసైటి
### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, ఫిబ్రవరి 15: (నేటినిజం ప్రతినిధి):పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రారంభించిన జిల్లా పోలీస్ ఎంప్లాయిస్ మ్యూచ్‌వల్లీ ఏయిడెడ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటి సత్ఫలితాలను సాధిస్తోంది. ఇప్పటి వరకు 20కోట్లరూపాయల టర్నోవర్‌తో పోలీసులకు సంక్షేమఫలాలను అందిస్తోంది. ఈ సొసైటి ప్రారంభమై నేటికి(మంగళవారం) 20సంవత్సరాలు పూర్తియింది. సొసైటీ ద్వారా పోలీసుల సంక్షేమకోసం అమలవుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాల వివరాలు ఇలా ఉన్నాయి.

2001 ఫిబ్రవరి 16న పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సొసైటిని ప్రారంభించి వివిధ స్థాయిలకు చెందిన పోలీసులకు కేవల 42పైసల వడ్డీతో వ్యక్తిగత, ఉన్నతవిద్య, వివాహాలకు రుణాలను అందజేస్తున్నారు. వ్యక్తిగత రుణంకింద 03లక్షలు, ఉన్నతవిద్యలకోసం 04లక్షలు, కుటుంబసభ్యుల వివాహాలకు 05లక్షల రూపాయలను రుణంగా అందజేస్తూ 36, 48, 60నెలల వాయిదాల్లో సభ్యుల నెలజీతం నుండి రికవరీ చేస్తున్నారు. రుణాలను అందజేయడం ద్వారా వస్తున్న 42పైసల వడ్డీని సొసైటీలోని సభ్యులందరి ఖాతాల్లో జమచేస్తున్నారు. సొసైటిలో ఇప్పటి వరకు కానిస్టేబుల్ నుండి ఎస్ఐస్థాయి వరకు గల అధికారులు 2971మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సొసైటికి పోలీస్ కమిషనర్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా అడిషనల్ డిసిపి(పరిపాలన), కార్యదర్శిగా అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ), కోశాధికారిగా పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు కొనసాగుతున్నారు. ఈ కార్యవర్గం ప్రతి 06నెలలకు ఒకసారి సమావేశమై రుణాల పెంపుదల, సవరణలు చేస్తూ పోలీసుల సంక్షేమమే ప్రధానలక్ష్యంగా పనిచేస్తోంది. సభ్యత్వం కొనసాగింపు కోసం సొసైటీలో సభ్యులుగా ఉన్న పోలీసుల జీతాల నుండి ఒకవెయ్యిరూపాయలను వారి అనుమతితో రికవరీ చేస్తూ జమచేస్తున్నారు. పదవి విరమణ సమయంలో జమఅయిన మొత్తానికి సంబంధించిన రూపాయలను చెక్కుల రూపంలో అదేరోజున అందజేయడం జరుగుతున్నది.

**ప్రతిసభ్యునికి ప్రమాదభీమాపాలసీ**

ఈ సొసైటిలో సభ్యులుగా కొనసాగుతున్న వారికి ప్రతి సంవత్సరం వ్యక్తిగత భీమాపథకం పాలసీ చేయిస్తున్నారు. దురదృష్టశాత్తు ఏవైనా ప్రమాదాల్లో మృతిచెందితే 03లక్షలు రూపాయలు, తీవ్రగాయాలపాలైన వారికి 30శాతం వరకు ఖర్చులను చెక్కులరూపంలో చెల్లిస్తున్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి**

క్రెడిట్ కో-ఆపరేటివ్ ద్వారా అందిస్తున్న రుణాలతోపాటు శాఖాపరంగా అన్నిస్థాయిలకు చెందిన పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నాము. సభ్యుల అవసరాలను తీర్చడమేకాకుండా, వాటిలో వాస్తమెంతో నిర్ధారించేందుకు రహస్యంగా విచారణ చేపట్టి అవసరం ఉన్న వారిని గుర్తిస్తూ రుణాలను అందజేయడం జరుగుతున్నది. సొసైటీద్వారా జమ అయిన డబ్బులను శాశ్వత అవసరాలకోసం మాత్రమే సభ్యులు వినియోగించాలని సూచిస్తున్నాము. మరిన్ని సంక్షేమ పథకాలను అందుబాటులో తీసుకవచ్చేందుకు ప్రణాళికలను రూపొందించామని, అతిత్వరలో ఆ పథకాలు అందుబాటులోకి రానున్నాయి.

## తిరుమలకు క్రమంగా పెరుగుతున్న భక్తులు

తిరుపతి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో మూతపడి..నిబంధనల మేరకు తెరుచుకున్న తిరుమలకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ఎప్పుడూ భక్తులతో రద్దీగా ఉండే తిరుమల కొండపైన కూడా మొదటిలాగా భక్తులు ఉండటం లేదు. అయితే ఆదివారం రికార్డు స్థాయిలో 56448 మంది భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం. కేవలం తలనీలాలు సమర్పించిన భక్తులే 27323 మంది ఉన్నారు. ఇక హుండి ఆదాయం 3.63 కోట్లుగా ఉంది. లాక్ డౌన్ అనంతరం ఆదివారంఅత్యధిక సంఖ్యలో శ్రీ వారిని దర్శించుకున్నారు. ఇక ఈనెల 19వ తేదిన రథసప్తమి వేడుకలు జరగనున్నాయి. ఈ క్రమంలో అర్జిత సేవలను రద్దు చేసింది టిటిడి. ఉదయం 6.38 నిముషాలకు శ్రీవారి పాదాలను సూర్యకిరణాలు స్పృశించనున్నాయి. రథసప్తమి పర్వదినం రోజున సప్తవాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు మలయప్పస్వామి. అయితే దర్శన టోకెన్లు కలిగిన భక్తులను మాత్రమే గ్యాలరీలోకి అనుమతించనుంది టిటిడి. ఇక రథసప్తమి ఏర్పాట్లును చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గోపీనాథ్ జెట్టి, అర్బన్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు పరిశీలించారు.

# తెలంగాణలో ప్రోత్సాహకాలతో తీరని వ్యధలు

### మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి
### ధాన్యం కొనుగోళ్లకు పూర్తి భరోసా దక్కాలి

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): రైతులు బాగుపడితే మొత్తం గ్రామమే బాగుపడుతుందన్న నినాదంతో సిఎం కెసిఆర్ చేపట్టిన రైతు సంఏమ పథకాల వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేవలం రైతుబంధు, విద్యుత్‌లో సత్ఫలితాలు రావని గుర్తించడం లేదు. రైతుబంధులోనూ వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో నగదు పడిపోతోంది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇక నాతెలంగాణ కోటి ఎకరాల మాగాణా అన్న నినాదం ఎత్తుకున్న సిఎం కెసిఆర్ దీనిని నిజం చేసేందుకు ప్రాజెక్టులను జెట్ వేగంతో నిర్మిస్తున్నారు. కాళేశ్వరం, దేవాదుల పనుల వేగం చూసి అందరూ ఆశ్చర్య పోతున్నారు. ఈ ప్రాజెక్టులు కూడా పూర్తి అయితే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారుతాయి. గ్రామాలు మళ్లీ జీవం పొందుతాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి. నీటిసౌకర్యం పెరగడంతో తెలంగాణలో ధాన్యం దిగుబడులు కూడా పెరిగాయి. అయితే ఈ మేరకు కొనుగోళ్లు మాత్రం సాగడం లేదు. చివరి గింజవరకు ధాన్యం కొంటామన్న ప్రకటనకు కట్టుబడి విస్తృత ఏర్పాట్లు చేయాలి. అయితే రైతుల సంక్షేమానికి మాత్రం ఓ అడుగు పడిందనే చెప్పాలి. ఆరు దశాబ్దాల పోరాటం,అమరుల త్యాగ ఫలితం,సిఎం కెసిఆర్ నాయకత్వంలో ఎంతో కష్టపడి తెచ్చుకున్నతెలంగాణను ఇష్టపడి అభివృద్ధి చేసుకునేందుకు సిఎం కెసిఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. గత ఆరేళ్లలో తన పరిపాలన దక్షతతో చేపట్టిన పథకాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. అందరి దృష్టి తెలంగాణ వైపు ఆకర్షించేలా చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు వ్యవసాయం పరిస్థితి,ప్రస్తుత వ్యవసాయ పరిస్తితి చూస్తే మనకు తేడా కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. గతంలో రైతులకు కనీసం నాలుగుగంటలు కూడా కరెంటు రాక, విత్తనాలు, ఎరువులు దొరకక చెప్పులు క్యూలో పెట్టి ఎదురు చేసే రోజులను అప్పుడే ఎలా మరచిపోగలం. రాష్ట్రం లోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోని లేని విప్లవత్మాకమైన పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకాన్ని తెలంగాణ అమలు చేయడంతో వ్యవసాయం నిజంగా పండగలా సాగుతోంది. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ముకోలేక పోతున్నారు. పాలకులు అన్నవారు ఇలాంటి ఆలోచనే చేయాలన్న విధంగా రైతుబంధుతో కెసిఆర్ ఆర్థికంగా అండగా నిలిచారు. తెలంగాణలో చేపట్టిన రైతుబంధు పథకం రైతులు నైరాశ్యంలో మునగకుండా చేసింది. వారికి అందించిన పెట్టుబడి ప్రోత్సాహకం అన్నది వారిలో భరోసా కల్పించేందుకు నిలిచింది. రైతులు కన్నీరు పెట్టకుండా కెసిఆర్ తోడ్పాటు అందించారు. ఆయన ఇచ్చి ప్రోత్సాహం ఇప్పుడు వారిలో ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్కరైతు రుణపడి ఉంటారు. కమిషన్లకు కక్కుర్తి పడి, ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా లక్షకోట్లు ఖర్చుపెట్టి నిధులు దిగమింగిన వారికి ఈ పథకం ద్వారా కనువిప్పు కాకున్నా రైతులకు మాత్రం అర్థం అయ్యింది. కేవలం ఓట్ల దృష్టితో చూసే వారికి ఇది ఓట్ల పండగ లాగనే ఉంటుంది. ఇది ఓట్లు కొల్లగొట్టే పథకమే అనిపిస్తుంది. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని ఆలోచన, ఊహించని పథకం ఇదని చెప్పవచ్చు. ఈ పథకంతో సిఎం కేసిఆర్ దేశానికి కొత్త దారి చూపారు. రైతులను ఆదుకునేందుకు ఎలా బాటలు వేయాలో చెప్పారు. కొత్త చరిత్రకు నాంది పలికారు. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు ముఖ్యమంత్రి కేసిఆర్ గొప్ప ఆశయంతో తీసుకొచ్చిన రైతుబంధు పథకం కేవలం ఓ ముందడుగు మాత్రమే. చెరువుల పునురుద్దరణ కార్యక్రమాలు పూర్తయి, ప్రాజెక్టులు సాకారం అయితే గ్రామీణ ఆర్థికవ్యవస్థ మళ్లీ గాడిన పడుతుంది. మూలనపడ్డ కులవృత్తులకు జీవం వస్తుంది. తొలుత తెలంగాణలో పగటి పూట 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను వ్యవసాయానికి ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయనో లేదా పీజులు ఎగిరి పోయాయనో సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలను ఒక్కటంటే ఒక్కటి కూడా చూడలేదు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు 24 గంటలు ఉచిత విద్యుత్ అందించే ఏకైక రాష్ట్రంగా తెలంగాణను దేశంలో ముందువరసలో నిలబెట్టారు. అదేవిధంగా రైతులకు లక్ష రూపాయలలోపు పంట రుణాల మాఫీని కూడా చేసిచూపారు. ఏ ఒక్కరైతు కూడా ఎరువులు, విత్తనాల కోసం క్యూలైన్లలో నిలబడే ఖర్మ లేకుండా చేశారు.

## ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు : ముగ్గురు మృతి



జగిత్యాల, ఫిబ్రవరి 15 : జగిత్యాల జిల్లాలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు రోడ్డుప్రమాదం సంభవించింది. జగిత్యాల నుంచి జోగినపల్లికి వెళ్తున్న కారు మేడిపల్లి వద్ద ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లింది. ముగ్గురు మృతి చెందగా, ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు.

జగిత్యాలకు చెందిన ప్రముఖ న్యాయవాది కట్కూరి అమరేంద్రరావు తన భార్యా, కుమారుడు, కూతురుతో కలిసి జోగినపల్లికి దైవదర్శనం కోసం బయల్దేరారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో కారు ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లడంతో.. అమరేంద్రావుతో పాటు భార్య శిరీష, కూతురు శ్రేయ గల్లంతు అయ్యారు. కుమారుడు జయంత్ చాకచక్యంగా బయటకు వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో కారును బయటకు లాగారు. అమరేంద్రరావుతో పాటు ఆయన భార్య, కూతురు మృతదేహాలను పోలీసులు బయటకు వెలికితీశారు.

## కెసిఆర్‌కు బర్త్‌డే కానుకగా మొక్కలు

### -కోటి వృక్షార్చనలో పాల్గొందాం అన్న ఎమ్మెల్యే

మహబూబాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి పథకాలన్ని సీఎం కేసీఆర్ పెట్టి రైతులకు పెట్టుబడి సాయం అందించడం ఎంతో సాహసోపేతమైన నిర్ణయం అని ఎమ్మెల్యే శంకర్నాయక్ అన్నారు. రైతుబంధు పథకమే కాకుండా తెలంగాణలోని ప్రతీ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా ఉంటున్నాయని అన్నారు. ఇలాంటి పథకాలు పెట్టి రాజకీయాలకు అతీతంగా వాటిని అమలు చేయండం అభినందనీయమని అన్నారు. కెసిఆర్ పథకాలతో తెలంగాణలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. అలాంటి సిఎం కోసం మనమంతా కృతజ్ఞతగా మొక్కలునాటాలన్నారు. ఎంపి సంతోష్ చేపట్టిన కోటి వృక్షార్చనను బాధ్యతగా తీసుకుని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతామన్నారు. టిఆర్ఎస్ కార్యకర్తలు అంతా ఇందులో పాల్గొనాలన్నారు. ఇలాంటి పథకం అమలు చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు అందిస్తున్న రైతుబంధు పథకాన్ని ఆంధ్రా ప్రాంతానికి చెందిన రైతులకూ అందిస్తూ సాగుకు పెట్టుబడి అందించే పెద్దన్న సీఎం కేసీఆర్ అని అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి వృక్షార్చన పథకంలో భాగంగా అందరూ పాలుపంచుకోవాలన్నారు. ఇకపోతే పెట్టుబడి సాయాన్ని రైతులు సాగు కోసమే వినియోగించి, అధిక దిగుబడులు సాధించి సిఎం కేసీఆర్ సంకల్పాన్ని నెరవేర్చాలనిసూచించారు. పెట్టుబడి సాయాన్ని రైతులు ఇతర ప్రయోజనాలకు వాడుకోకుండా వ్యవసాయానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇకపై రైతులు రుణాల కోసం బ్యాంకుల్లో పాస్ పుస్తకాలను తనఖా పెట్టాల్సిన పనిలేదన్నారు.

## ఊరూరా మొక్కలు నాటుదాం

### -కెసిఆర్‌కు కానుకగా ఇద్దాం: పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలతో తెలంగాణ దశదిశ మారిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ గౌడ్ అన్నారు. ఆయన చేపట్టిన హరితహారంతో తెలంగాణ ఇప్పుడు ఆకుపచ్చ తెలంగాణ మారుతందన్నారు. ఇదే సందర్భంలో మరోమారు కెసిఆర్ బర్త్‌డే సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, కోటి వృక్షార్చనలో భాసగ్వాములం కావాలని పిలుపిచ్చారు. కెసిఆర్ పథకాలు దేశానికి ఆదర్శంగా ఉంటూటే ప్రజలు ఎంతో ఉపయోగంగా మారాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ పథకాలను భారతదేశంలో ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. రైతుబీమా పథకం ద్వారా మృతి చెందిన రైతు కుటుంబానికి వారం లోపు రూ.5 లక్షల నగదును ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలను బలోపేతం చేసిందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలో ఉన్న చెరువులన్నింటిని అభివృద్ధి చేసిందన్నారు. ఇన్నికార్యక్రమాలను అమలు చేస్తున్న సిఎం కెసిఆర్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కో మొక్క నాటి కెసిఆర్ రుణం తీర్చుకోవాలన్నారు. ఎంపి సంతోష్ పిలుపు మేరకు ప్రతి కార్యకర్తా ఓ మొక్కనాటి చిత్తశుద్ధి చాటాలన్నారు. హరితహారం బలపడాలంటే మొక్కలునాటడంతో పాటు పెంచాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఆరోగ్య తెలంగాణకు తోడ్పాటు ఇవ్వాలన్నారు. పేద కుటుంబంలో ఉన్న ఆడ బిడ్డ వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గొల్ల, కురుమలకు గొర్రెల యూనిట్లు, మత్స్యకారులకు చేప విత్తనాలు, వాహనాలను అందజేసిందని గుర్తు చేశారు. అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చేతి పంపులు, తాగునీటి బావులతో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. ప్రభుత్వం అందజేసిన సహాయాన్ని గుర్తు పెట్టుకోలని కోరారు.

## మత్స్యకారులకు అండగా సిఎం కెసిఆర్

సంగారెడ్డి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ ఆశించిన విధంగా చెరువులు, కుంటలు నిండినట్లయితే గంగపుత్రులు,మత్స్యకారుల ఉపాధికి ఢోకా ఉండదని గంగపుత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య అన్నారు. గంగపుత్రుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. మత్స్యకారుల జీవనోపాధికై ఆటోలు,టీవీఎస్ మోపెడ్ వాహనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తూ అండగా నిలుస్తున్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మత్స్యకారులంతా సీఎం కేసీఆర్‌వైపే నిలబడి కారుగుర్తుకే ఓట్లేసి గెలిపించారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ గంగపుత్రులు, మత్స్యకారులంతా కారుగుర్తుకు ఓట్లేసి ఎంపీలను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు. చేప పిల్లలను సబ్సిడీపై అందిస్తూ వారి ఉపాధికి ఆయన చొరవ చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 46వేల చెరువులను ఇప్పటికే ఆధునీకరించడం జరిగిందన్నారు. కాళేశ్వరం, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయినట్లయితే మత్స్యకార కులస్తులతో పాటు వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

# బీసీల అభివృద్ధి టీఆర్ఎస్‌తోనే సాధ్యం: మంత్రి గంగుల



నిజామాబాద్, ఫిబ్రవరి 15: వెనుకబడిన కులాలను అభివృద్ధిలోకి తీసుకురావాలన్నదే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. నిజామాబాద్‌లో బీసీ కుల సంఘాల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి మాట్లాడారు. బీసీలకు కావాల్సినవి తెలుసుకొని వాటినే చట్టాలుగా చేయండని సీఎం కేసీఆర్ చెప్పారు.

గత డెబ్బై సంవత్సరాల్లో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా బీసీలను నిర్లక్ష్యం చేశారని మంత్రి పేర్కొన్నారు.

గత ప్రభుత్వాలు బీసీలకు విద్యను అందించడంపై దృష్టి పెట్టలేదు. 2015 సంవత్సరంలో 261 గురుకులాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం లక్షలాది మంది బీసీలు గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని ఆయన వెల్లడించారు. సంచార జాతులు, ఎంబీసీలకు గుర్తింపునిచ్చిన ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. బీసీల ఆత్మగౌరవ భవనాల కోసం, సీఎం కేసీఆర్ హైదరాబాద్ లో 82 ఎకరాలను కేటాయించారు.

కుల వృత్తుల నైపుణ్యాలు పెంపొందించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ నేతలు నిధులపై కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు.నిజామాబాద్‌లో బీసీ బాలిక, బాలురకు ప్రత్యేకంగా మరో రెండు హాస్టళ్ళు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత, మంత్రి గంగులను కోరారు.

అంతేకాదు, నిజామాబాద్ లో సావిత్రి పూలే పేరుతో బీసీ భవన్ నిర్మించాలని, డ్రైవర్ కమ్ ఓనర్ పథకాన్ని బీసీ లకు సైతం వర్తింపజేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్, ఎమ్మెల్యే గణేష్ గుప్తా, ఎమ్మెల్సీలు వీజీ గౌడ్, ఆకుల లలిత, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు రాజారాం యాదవ్, బీసీ సంఘాల జిల్లా నాయకుడు నరహరి సుధాకర్, 34 బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అన్నివర్గాల అభివృద్ధికి కెసిఆర్ కృషి

### -మొక్కలు నాటడంపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

పెద్దపల్లి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కోటి వృక్షార్చనలో అంతా భాగస్వాములు కావాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అన్నింటా పోటీ పడి ముందుకు సాగేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఇందుకోసం పక్కాగా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ కార్యక్రమాన్ని వారంలోగా చేపట్టాలని సూచించారు. గతంలో రూర్బన్ పథకంతోపాటు, పెండింగ్ వర్కులపై చేసిన తీర్మాణాలను రద్దు చేసి నూతనంగా చేపట్టాలనీ ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. రోడ్డుకు అడ్డంగా మధ్యలో ఉన్న కరెంట్ స్తంభాలను తొలగించేందుకు విద్యుత్ అధికారులకు సహాయం తీసుకోవాలని సూచించారు. రూర్బన్ పథకంలో ఎన్నో పనులు పెండింగ్‌లో ఉన్నాయని నిధులున్న పనులు చేయించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అధికారులను పనిచేయించే భాద్యత స్థానిక నేతలు తీసుకోవాలని సూచించారు. అధికారుల పనితీరుపై ఆసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ ఏర్పడి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే తెలంగాణ రాష్ట్రం వృద్ధిలోకి వెళ్తుందనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా మురికి కాలువలు ఉండకుండా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలనీ, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా గ్రామాల్లో అంతర్గత రహదారులన్నీ 24 ఫీట్ల పైబడి ఉండేలా చూసుకోవాలని వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన వారంతా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సాధ్యమైనంత మేరకు అంతర్గత రహదారులను వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

## మొక్కలు నాటి సంఘీభావం తెలుపుదాం

### -హరిత తెలంగాణకు నాంది వేద్దాం

సిద్దిపేట,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితతెలంగాణకు పాటుపడాలని అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి సూచించారు. ఇందుకు ప్రతి టిఆర్ఎస్ కార్యకర్త ముందుకు రావాలన్నారు. ఇంటింటికీ కనీసం ఐదు మొక్కలను నాటి హరిత తెలంగాణను సాధించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తెలంగాణ అటవీ శాతాన్ని పెంచే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజలు ఇంటింటికీ మొక్కలు పెంచి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు కృతజ్ఞతగా అంతా మొక్కలునాటి సంఘీభావం ప్రకటించాలన్నారు. గతంలో అడవులను నరుక్కుపోతున్నా పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు కఠిన ఆంక్షలతో అడవులకు రక్షణ కల్పించారని అన్నారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రతి గ్రామంలో హరితహారాన్ని నిర్వహించాలన్నారు. ఇప్పటికే హరితహారం కోట్లాది మొక్కలు నాటి అందరి ప్రసంశలు పొందిందన్నారు. సీఎం కేసీఆర్ కృషితో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఇతర రాష్ట్రాల దృష్టి అంతా తెలంగాణపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ పాలనకు పట్టంగట్టిన ప్రజలు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని పత్తాకు లేకుండా చేశారన్నారు. టీఆర్ఎస్ ప్రజా పార్టీ అని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. దేశ ప్రజలు కూడా సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ఆహ్వానిస్తున్నారని చెప్పారు.

## అనంతసాగర్‌లో నేడు వసంతపంచమి వేడుకలు

సిద్దిపేట,ఫిబ్రవరి12(ఆర్ఎన్ఎ): ఈ నెల 16న వసంత పంచమి పురస్కరించుకొని చిన్నకోడూరు మండలం అనంతసాగర్ సరస్వతి క్షేత్రంలో వసంతపంచమి ఉత్సవాలు జరుగనున్నాయి. వేడుకల నిమిత్తం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సహజ సిద్ధంగా ఏర్పడిన జలగుహల సోయగాల మధ్య ఆధ్యాత్మిక కేంద్రంగా అనంతసాగర్ సరస్వతి క్షేత్రం విరాజిల్లుతోంది. దేశంలోనే వీణాపాణియై నిల్చున్న రెండో సరస్వతి క్షేత్రం కావడం విశేషం. ఏటా సరస్వతి జన్మదినం రోజున అక్షరాభ్యాసాలకు ఇక్కడ ప్రాధాన్యం ఉంది. ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులు బస చేసేందుకు ఆర్యవైశ్య సంఘం వసతిగృహాలు ఉన్నాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఉదయం నుంచి సాయంకాలం వరకు అక్షరాభ్యాసాలు, కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పణ వంటి కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇక చివరి రోజున అన్నదానం ఉంటుందని ఆలయ నిర్మాత అష్టకాల నరసింహరామశర్మ తెలిపారు.

## వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న కెసిఆర్

### హరిత తెలంగాణలో భాగస్వాములం అవుదాం: గొంగిడి సునీత

యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): తెలంగాణ సిఎం కెసిఆర్ అనుసరిస్తున్న వ్యవసాయ,అభివృద్ధి విధానాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ప్రధానంగా వ్యవసాయ రంగానికి ఇస్తున్న చేయూత దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆయన బర్త్‌డే సందర్భంగా కోటి వృక్షార్చనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కెసిఆర్‌కు కృతజ్ఞతగా తెలంగాణను మరిత తెలంగాణగా నిర్మించే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రైతుబంధు పథకంతో పాటు, నీటిపారకం వల్ల వ్యవసాయ రంగంలో సరికొత్త వెలుగులు వచ్చాయని, ధాన్యం దిగుబడి పెరిందని సాగు కోసం దళారుల వద్దకు, వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లి అప్పులు చేసే సమస్యల నుంచి సీఎం కేసీఆర్ గట్టెక్కించారని అన్నారు. రైతులకు ఉచితంగా పెట్టుబడిని అందిస్తున్న ఏకైక సిఎం కెసిఆర్ అని ఎమ్మెల్యే అన్నారు. దేశంలోనే రైతులను ఆదుకొని, వారికి ప్రయోజనం కలిగించే విధంగా సీఎం కేసీఆర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వడం ద్వారా వారి కష్టాలనుంచి గట్టెక్కించిందన్నారు. భూములకు సంబంధించిన ధరణి వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందుపర్చారన్నారు.

## కెసిఆర్ నమ్మకాన్ని నిలబెట్టండి

### -సస్యవిప్లవం తెచ్చేలా పథకాలు: జోగు

ఆదిలాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో మళ్లీ అడవులు చిగురిస్తున్నాయని, కొత్త అడవులకు నాంది పడిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కేవలం సిఎం కెసిఆర్ చేపట్టిన మరితహారంతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు. తాజాగా సిఎం బర్త్‌డే ను పురస్కరించుకుని చేపడుతున్న కోటి వృక్షార్చనలో అందరం భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. ఇకపోతే కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలతో దేశ వ్యవసాయరంగానికి తెలంగాణ దిశచూపిందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ఈ మహోన్నత కార్యక్రమాన్ని రైతుకు స్వర్ణయుగంగా అభివర్ణిస్తూ ప్రతీఒక్కరూ సాగు సహాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని సుసంపన్నం చేస్తున్నారని అన్నారు. తద్వారా అధిక ఉత్పత్తులు సాధించి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే వ్యవసాయ రంగంలో నంబర్‌వన్‌గా నిలబడిందని అన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెక్కుల పంపిణీ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని తెలిపారు. వానాకాలం సీజన్‌కు ముందుగానే రైతులు వారికి ఇష్టమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందని, వ్యాపారులు మాటలు నమ్మకుండా మేలు రకమైన విత్తనాలను తీసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి డబ్బులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. రైతులు ఇష్టానుసారంగా ఎరువులను వాడి డబ్బులు వృథా చేసుకోవద్దని వ్యవసాయ క్లస్టర్ పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటి ఆధారంగా ఎరువులను పంటలకు వినియోగించాలని కోరారు.

## లోకేశ్‌పై విజయసాయి వ్యంగ్యాస్త్రాలు

### -పప్పుకే పప్పుని నిరూపించుకున్నాడని విమర్శలు

అమరావతి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): లోకేష్‌పై వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. లోకేష్ తాను పప్పులకే పప్పుని నిరూపించుకున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. 1978లోనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను టీడీపీ అడ్డుకుందట. ఉద్యమాలు చేసిందట!. టీడీపీ పుట్టింది 1982లో కదా చిట్టీ? అంటూ చురకలు అంటించారు. 'అవునులే, మీ నాన్న స్వతంత్ర పోరాటం చేశానని చెప్పుకున్నాడు. నీవు 1978లోనే విశాఖ ఉక్కు కోసం పోరాడే ఉంటావు! అంటూ విజయసాయిరెడ్డి చలోక్తులు విసిరారు. టీడీపీ ఇంకా బతికే ఉందని చెప్పేందుకు చంద్రబాబు భ్రమ రాజకీయాలు చేస్తున్నారని మరో ట్వీట్‌లో విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. పచ్చ కుల మీడియాలో ఫేక్ న్యూస్ వేయించినంత మాత్రాన పంచాయతీలు గెలిచినట్లా? అని ప్రశ్నించారు. మీ భార్య దత్తత తీసుకున్న కొమరవోలులో టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఓడారు. నీ జిల్లా, మీ అత్తగారి జిల్లాలోనూ వైఎస్సార్ సీపీ ప్రభంజనమే బాబూ అని విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో పేర్కొన్నారు

## సాగుచట్టాల రద్దుకు సుప్రీంలో పిల్: వడ్డే

అమరావతి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని సుప్రీంకోర్ట్‌లో పిల్ వేశామని టీడీపీ సీనియర్ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నల్లచట్టాలు వద్దని ఆందోళన చేస్తున్న రైతులను అవమానించేలా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆందోళన జీవులని, ఉగ్రవాదులని మాట్లాడటం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా 18న కిసాన్ సంఘర్ష కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో రైల్‌రోకో చేపడతామని తెలిపారు. నల్లచట్టాలు రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని వడ్డే శోభనాద్రీశ్వరరావు చెప్పారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవం

### -ఆశయాలను కొనసాగిస్తామన్న లోకేశ్

అమరావతి,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ఎన్టీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ట్విటర్ వేదికగా స్పందించారు. తాత ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ దేశవ్యాప్తంగా ప్రజలకు 'ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్' అండగా నిలుస్తోందన్నారు. రక్తనిధి, ఉచిత వైద్య శిబిరాలు, సురక్షిత మంచినీటి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి తదితరాలపై కృషి చేస్తోందన్నారు. పేదల సాధికారతకు, ప్రకృతి విపత్తులలో ఇప్పటివరకు 16 లక్షల మందికి పైగా ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ ఈరోజుతో 24 సంవత్సరాలు పూర్తిచేసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆశయాలు పంచుకుంటున్న ట్రస్ట్ సిబ్బందికి, కార్యనిర్వాహకులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పీసీసీ రేసు కోసం కాంగ్రెస్‌లో పోటీ

### ఎవరికి వారు తామే అర్హులమంటూ ప్రచారం
### సాగర్ ఉప ఎన్నిక తరవాతనే భర్తీ చేసే అవకాశం

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు అందిర దృష్టి పిసిసి అధ్యక్ష పీఠంపైనే ఉంది. ఎవరికి వారు కాంగ్రెస్ అధిష్టానాన్ని కలసి తమకే పిసిసి పదవి ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. దీనికితోడు ఉత్తమ్ పదవీ కాలం ముగియడం,ఆయన తప్పుకుంటానని ఇప్పటికే వ్రప్రకటించడం జరిగింది. తెలంగాణలో సిఎం కెసిఆర్‌ను ఎదుర్కొనే ధీటైన నాయకుడి కోసం కాంగ్రెస్ అధిష్టానం చూస్తున్నట్లు సమాచారం. అయితే సాగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో దీనిని వాయిదా వేశారు. లేకుంటే ఈ పాటికే పిసిసి పదవి భర్తీ అయ్యేది. ఇప్పుడు ఆశావహులు అనేకలు ఎవరికి వారు తమ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్నారు. పాదయాత్రలతో సమస్యలపై పోరాడుఉతన్నారు. ఈ కోవలో పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీ పదవి నుంచి తప్పుకుంటానని ప్రకటించడంతో కొత్త వారిని నియమించాలని పార్టీ అధిష్టానం నిర్ణయానికి వచ్చింది.

అంతో, ఇంతో పార్టీ ఎదిగేందుకు అవకాశం ఉన్న రాష్ట్రం కావడంతో పార్టీని పటిష్టం చేయాలంటే టీపీసీసీ అధ్యక్షుడిని మార్చాలనే నిర్ణయానికి ఏఐసీసీ వచ్చిందని తెలుస్తున్నది. ఎప్పటినుంచో టీపీసీసీ అధ్యక్షుడిని మార్చాలని పార్టీ నేతలు ఎంత మొత్తుకున్నా అధిష్టానం పట్టించుకోలేదు. ఇక అన్ని ఎన్నికలు అయిపోవడంతో టీపీసీసీ అధ్య క్షుడిగా కొత్తవారిని నియమించాలని పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు టిడిపి నుంచి కాంగ్రెస్‌లో చేరి, ఎంపిగా గెలుపొందిన రేవంత్ రెడ్డి కూడా ముందు వరుసలో ఉన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా పదవిని ఆశిస్తున్నారు. వృద్దనేత విహెచ్ కూడా బిసి కోటా అంటూ డిమాండ్‌ను తీసుకుని వస్తున్నారు. ఎస్సీకోటాలో మల్లు భట్టి విక్రమార్క కూడా పోటీ పడుతున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు టీపీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్టానం ఆయన పేరును నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికలు తప్ప మరేమి లేకపోవడం గమనార్హం. 2018 జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున దెబ్బతిన్నది. కేవలం 21 స్థానాలకే సరి పెట్టుకోవాల్సి వచ్చింది. గెలిచిన ఆ కొద్ది మంది కూడా పార్టీ నుంచి జంప్ అయ్యారు. అందులో అనేకులు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గెలిచిన వారు టిఆర్ఎస్‌లోకి వెళుతుననా వాళ్లను నిలువరించలేకపోయారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా సొంతంగానే బరిలోకి దిగిన కాంగ్రెస్ మూడు ఎంపీ స్థానాల్లో గెలుపొందింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పార్టీ మెజారిటీ స్థానాలను దక్కించుకోలేక చతికిలపడింది. టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, వి. హన్మంతరావు, మల్లు భట్టి విక్రమార్కలతో పాటు ,మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పోటీ పడుతున్నారు. మధ్యలో జీవన్ రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. నాయకులు ఎవరికి వారు పలుసార్లు ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీని కలిసినట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్ష పదవిని రెడ్డి సామాజిక వర్గానికి గాకుండా ఇతర వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని పార్టీ భావిస్తున్నది.

రెడ్డి సామాజివర్గంలో ఎవరికి ఇచ్చినా ఇబ్బందులు తలెత్తవచ్చని, ఇప్పుడు ఆ పదవిని ఆ వర్గానికి ఇవ్వకపోయినా పార్టీపరంగా పెద్దగా నష్టం జరిగేదేమి ఉండదని పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో రెడ్డియేతర సామాజిక వర్గానికి చెందినవారికే ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. హన్మంత రావు వయసురీత్యా వృద్ధుడు కావడం, శ్రీధర్‌బాబు యువకుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆయనకే టీపీసీసీ పదవిని కట్టబెట్టాలనే యోచనలో పార్టీ ఉన్నట్లుగా తెలుస్తున్నది. అయితే మధ్యలో మైనార్టీ నేత షబ్బీర్ పేరు కూడా ప్రముఖంగా వినవస్తోంది. కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష నేతగా దళితులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మల్లు భట్టి విక్రమార్కకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయన టీపీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. ప్రధానంగా రేవంత్‌రెడ్డి పేరు వినిపిస్తున్నప్పటికీ ఆయనకు ఆ పదవిస్తే సీనియర్లు పార్టీకి దూరమయ్యే పరిస్థితి ఉందని పార్టీవర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. మొత్తానికి సాగర్ ఉప ఎన్నిక ముగిస్తే తప్ప వ్యవహారం బయటపడేలా లేదు.

# హరితహారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### కార్యదర్శుల పనితీరుపై అధికారుల మదింపు

ఆదిలాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): నూతన పంచాయతీ చట్టం ప్రకారం విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన గ్రామ కార్యదర్శులను తొలగించే అధికార జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. ముఖ్యంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా 85 శాతం మొక్కలను రక్షించని వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. హరితహారం పట్ల నిర్లక్ష్యం వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. చట్టప్రకారం గ్రామాల్లో నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కల సంరక్షణ బాధ్యత కార్యదర్శుల పైనే ఉంటుంది. గ్రామీణాభివృద్ధి శాఖ నివేదిక ఆధారంగా కార్యదర్శులపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో హరితహారం పథకం కింద నాటిన మొక్కల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందిస్తున్నామని అన్నారు. కలెక్టర్ ఆమోదంతోనే తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. మొక్క నాటినప్పటి నుంచి ఎదిగే వరకు దానిని కాపాడే బాధ్యత పూర్తిగా గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఉంటుందని నూతన పంచాయతీ చట్టం చెబుతుంది. కొత్త పంచాయతీ చట్టాన్ని రూపొందించిన పకడ్బందీగా అమలు చేయకుంటే జిల్లాలో హరితహార కార్యక్రమం విజయవంతం కావడం అనుమానంగానే కనిపిస్తుంది. రూపొందించిన నివేదికను గ్రామీణాభివృద్ధి శాఖ కలెక్టర్ ఆమోదంతో పంచాయతీ అధికారులకు అందజేస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. పల్లె ప్రగతితో గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన ఆశించిన ఫలితం కనిపించ లేదు. అక్కడక్కడ మొక్కలను బ్రతికించేందుకు ట్రీగార్డ్సు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ లేక కనిపించకుండానే పోతున్నాయి. దీనికి తోడు పంచాయతీ కార్యదర్శులకు విధుల భారం పెరిగి పోవడంతో మొక్కల సంరక్షణ పై దృష్టి సారించలేక పోయారు. చివరకు 85శాతం లక్ష్యం చేరుకోని గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికారులు సిద్ధం కావడంతో ఆయా పంచాయతీల కార్యదర్శుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లాలో హరితహార కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించింది. నాటిన మొక్కలలో కనీసం 85 శాతం మొక్కలను కాపాడే బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందని పంచాయతీ చట్టంలో స్పష్టంగా పేర్కొంది. లక్ష్యం చేరని గ్రామ కార్యదర్శులపై చర్యలు ఉంటాయని హెచ్చరించింది. దీంతో కొందరు గ్రామ కార్యదర్శులు అప్పట్లో ఆందోళన వ్యకతం చేశారు. మొక్కలను కాపాడే బాధ్యత పూర్తిగా కార్యదర్శుల పైనే ఉందని చట్టం చెబుతున్నా..అమల్లో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో మొక్కలు నాటిన ఇప్పటి వరకు గుర్తించే కార్యక్రమం పూర్తికాలేదు. మొక్కల సంరక్షణపై పదే పదే హెచ్చరికలు జారీ చేసిన పట్టించుకోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల పై చర్యలు తీసుకునేందుకు సమగ్రమైన నివేదికలు రూపొందించి కలెక్టర్ ఆమోదంతో చర్యలు తీసుకునేందుకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

# 17న పెద్ద ఎత్తున మొక్కలు నాటుతాం

### కోటి వృక్షార్చనలో అంతా భాగస్వాములం అవుదాం
### కెసిఆర్‌కు కానుకగా మొక్కల పెంపకం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం వినూత్న పథకాలతో ముఖ్య మంత్రి కేసిఆర్ అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. 17 కెసిఆర్ జన్మదినం పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా లక్షల్లో మొక్కలు నాటాలని నిర్ణయించామని అన్నారు. అదేవిధంగా కోటి వృక్షార్చనలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి కెసిఆర్‌కు కానుకగా ఇద్దామని అన్నారు. అటవీశాక ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. కెసిఆర్‌కు ఇదే బర్త్‌డే కానుకని అన్నారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వం బంగారు తెలంగాణకు బాటలు వేస్తోందని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెంపడంతో పాటు రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రమాదాలకు తావు లేని రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని, సాహసోపేత నిర్ణయాలతో కేజీఆర్ తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతులకు ఎంతో బాసటగా ఉంటున్నాయన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్‌లతో పేద కుటుంబాల్లోని ఆడ పిల్లలకు ఎంతో అండగా ఉంటున్నాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు చోటివ్వకుండా తెలంగాణ ప్రజలందరికీ ప్రయోజనాలు చేకూర్చాలన్నదే కెసిఆర్ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహార కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాలో జోరుగా సాగిందన్నారు. గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 2018లో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించింది. ఇందులో హరితహార కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు.

# గిరిజనుల అభ్యున్నతి సంత్ సేవాలాల్ ఎంతో కృషి

### -జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): గిరిజనుల ఆరాధ్యం దైవం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి.

నిజామాబాద్ జిల్లాలోని తారక్‌రామ్ నగర్‌లో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే గణేశిశ్ గుప్తా, ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఉత్సవ హోమంలో కవిత పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం మహనీయుడు సంత్ సేవాలాల్ ఎంతో కృషి చేశారన్నారు. బంజారాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రతి యేటా ప్రభుత్వం రూ. కోటి విడుదల చేస్తోందని తెలిపారు. బంజారాల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అపారమైన ప్రేమ ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించడం గర్వకారణం అని పేర్కొన్నారు నాగోబా జాతరకు కూడా రూ. కోటి ప్రకటించారని ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు. బంజారాల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గణెశిష్ గుప్తా తెలిపారు. ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతి కోసం రూ.కోటి నిధిని ప్రభుత్వం మంజూరు చేస్తోందని చెప్పారు. ఇప్పటివరకు అన్ని పార్టీలూ గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూశాయని, కేసీఆర్ మాత్రమే వాళ్ల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. తెలంగాణ వచ్చాక తండాలన్నీ గ్రామ పంచాయతీలుగా మారి అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గణెశిష్ గుప్తా పేర్కొన్నారు.



# కోటి వృక్షార్చనతో తెలంగాణకు హరితం

### -కెసిఆర్ బర్త్‌డేకు కానుకగా మొక్కల పెంపకం: ఎర్రబెల్లి

వరంగల్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కోటి వృక్షార్చనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సిఎం కెసిఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఇది మన సమాజాన్ని పచ్చగా ఉంచుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇకపోతే తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో సిఎం కెసిఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. భూమి ఉన్న ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి అందుతుంది. భూములకు సంబంధించి ఏవైనా ఇబ్బందులుండి ఇప్పుడు పంట పెట్టుబడి రాని రైతుల సమస్యలను పరిష్కరించి, వారికి కూడా పంట పెట్టుబడి అందిస్తాం. రైతులకు పంట పెట్టుబడి ఇచ్చే ఈ రైతుబంధు పథకం ఇక నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. ఆరేళ్ల కింద వ్యవసాయం అంటే గిట్టుబాటుకానిదిగా, దండగగా ఉండేనని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు సిఎం కెసిఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు రైతు పంట పెట్టుబడి కోసం ఎవరివైపు చూడకుండా ఉండేందుకు ఎకరానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఇంత వరకు రైతుకు పంట పెట్టుబడి ఇచ్చిన ప్రభుత్వంగానీ, నాయకులుగానీ లేరన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన ఈ పంట పెట్టుబడి పథకంవైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. వ్యవసాయానికి కనీసం రెండు గంటలు కూడా కరెంటు రాని పరిస్థితిని మార్చి ఇప్పుడు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారని, కోటి ఎకరాలను మాగాణాగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారని అన్నారు. రైతులకే కాకుండా పేదింట్లో ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావద్దని మొదట్లో 51వేల రూపాయలు ఇచ్చారని, అది సరిపోదని దానిని 75వేల రూపాయలకు పెంచారని, అదీ చాలదం లేదని ఇప్పుడు లక్షా 116 రూపాయలను ఇస్తున్నారన్నారు. పేదింట్లో ఆడపిల్ల గర్భం దాల్చితే ప్రసవం అయ్యే వరకు పని చేయాల్సి వస్తుందని గుర్తించిన సిఎం కేసిఆర్ ఇక అలాంటి పరిస్థితి ఉండొద్దని ప్రసవానికి మూడు నెలల ముందు, ప్రసవం తర్వాత మూడు నెలల వరకు నెలకు 2000 రూపాయల చొప్పున ఆరు నెలల పాటు 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే అదనంగా 1000 రూపాయలు కలిపి 13వేల రూపాయలు అందిస్తున్నారని చెప్పారు.

## గిరిజనుల భూములు లాక్కుంటూ కేసులా?

### -మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): గిరిజనులపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మరోమారు హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు వెళ్తామని తెలిపారు. మూడెకరాల భూమి, 10శాతం రిజర్వేషన్ హామీని నిలబెట్టుకోలేని.. సీఎం కేసీఆర్.. గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గుర్రంపోడు తండాలో గిరిజనులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. సేవాలాల్ జయంతి కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజన మహిళలు నృత్యాలు చేశారు. సేవ లాల్ జయంతి సందర్భంగా సేవాలాల్ చిత్ర పటానికి బండి సంజయ్ నివాళులు అర్పించారు. బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు హుసేన్ నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

### -పెట్రో ధరలకు నిరసనగా ఒడిషాలో బంద్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): దేశంలో చమురు ధరల మంట కొనసాగుతూనే ఉన్నది. గత వారం రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ వస్తున్న దేశీయ చమురు కంపెనీలు సామాన్యుల జేబులను గుల్ల చేస్తున్నాయి. నిన్న లీటర్‌కు 20 నుంచి 34 పైసలు పెంచిన కంపెనీలు తాజాగా పెట్రోల్‌పై 26 పైసలు, డీజిల్‌పై 29 పైసలు భారం మోపాయి. దీంతో దేశరాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.88.99కు చేరగా, డీజిల్ ధర రూ.79.35కు పెరిగింది. ఇక దేశంలోనే అత్యధిక ధరలు ఉన్న జైపూర్‌లో పెట్రోల్ రూ.95.51కి, డీజిల్ రూ.87.76, ముంబైలో పెట్రోల్ రూ.95.46, డీజిల్ రూ.86.34కు చేరాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలు రూ.92.53, రూ.86.23గా ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ఒడిశాలో రాష్ట్రవ్యాప్తంగా బంద్ కొనసాగుతోంది. ఆరు గంటలు రైల్ రోకోతో పాటు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది కాంగ్రెస్ పార్టీ. ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్స్ తో పాటు ఆర్టీసీ స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొంటోంది. వ్యాపారసంస్థలు కూడా స్వచ్ఛందంగా షాపులు మూసేశాయి. బంద్ తో రవాణా సౌకర్యం లేక జనాలు ఇబ్బంది పడుతున్నారు.

## వెలుగు చూస్తున్న లోన్‌యాప్ అక్రమాలు

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): లోతైన దర్యాప్తుతో లోన్ యాప్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. లోన్ యాప్ నిర్వాహకుల కుట్రలను పోలీసులు బయటపెట్టారు. ఖాతాదారుడితో చైనీస్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఢిల్లీకి చెందిన రోజువారి కూలీ ఖాతాలో కోటి రూపాయలు వేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఖాతా వాడుకున్నందుకు సదరు కూలీకి నెలకు రూ.4 వేల చొప్పున చెల్లించాయి. తన ఖాతాలో రూ.కోటి ఉన్నట్లు కూలీ తెలియదనడం గమనార్హం. ఇప్పటి వరకూ 25 వేల కోట్ల రూపాయల లావాదేవీలు గుర్తించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో సంస్థలు రూ.5 కోట్ల లావాదేవీలు జరిపినట్టు పోలీసులు వెల్లడించారు

## పరీక్షల్లో బాలిక ఫెయిల్.. ఫీజు తిరిగివ్వాలన్న కోర్టు

బెంగళూరు, ఫిబ్రవరి 15: ఒక బాలిక 9వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో ఆమె తండ్రి వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు ఫీజు తిరిగి ఇవ్వాలని సంబంధిత విద్యా సంస్థను ఆదేశించింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన జరిగింది. త్రిలోక్ చంద్ గుప్తా అనే వ్యక్తి తన కుమార్తెను ఒక స్కూల్‌లో 9వ తరగతిలో చేర్చారు. పరీక్షల్లో ఆమె పాస్ అయ్యేలా శిక్షణ ఇస్తామని ఆ విద్యా సంస్థ భరోసా ఇచ్చింది. దీంతో ఆయన ఫీజుల కింద రూ.69,408 చెల్లించారు.

అయితే ఆ విద్యా సంస్థ హామీ ఇచ్చిన మేరకు తన కుమార్తె చదువుపట్ల శ్రద్ధ చూపలేదని త్రిలోక్ చంద్ ఆరోపించారు. రెగ్యులర్ క్లాసులతోపాటు అదనపు తరగతులు సరిగా నిర్వహించలేదని, ఫలితంగా యూనిట్ టెస్ట్‌లో అన్ని సబ్జెక్టుల్లో తన కుమార్తె ఫెయిల్ అయ్యిందని తెలిపారు. పేరెంట్-టీచర్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయిందని విమర్శించారు. తాను చెల్లించిన ఫీజు మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని కోరుతూ వినియోగదారుల ఫొరాన్ని ఆశ్రయించారు.

కాగా, ఆ విద్యార్థిని సబ్జెక్టులను ఆకళింపు చేసుకోలేకపోవడంతో వ్యక్తిగత కారణాలతో కోర్సు నుంచి వైదొలగినట్లు ఆ విద్యా సంస్థ ఆరోపించింది. విద్య అనేది వస్తువు కాదని, కోచింగ్ సంస్థలు వినియోగదారుల రక్షణ చట్టం పరిధిలోకి రావని పేర్కొంది. అయితే ఈ కేసు సేవాలోపం కిందకు వస్తుందని వినియోగదారుల కోర్టు అభిప్రాయపడింది. బాలిక తండ్రికి రూ.26,250 ఫీజుతోపాటు కోర్టు ఖర్చుల కింద రూ.5,000 ఆరు వారాల్లో చెల్లించాలని ఆ విద్యా సంస్థను ఆదేశించింది.

## కొండ రాజశేఖర్ గౌడ్‌కు ఆర్థిక సహాయం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 15 : (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండ రాజశేఖర్ గౌడ్ గత నలభై రోజుల క్రితం తాటి చెట్టు పైనుండి కింద పడటంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి, తలకు ఆపరేషన్ నిర్వహించగా సుమారు 10 లక్షల వరకు ఖర్చు కాగా నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు చేసి ఆపరేషన్ చేశారు, ఇంకా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించడంతో ' నా కలం అక్షర సత్యం' అనే ఫేస్బుక్ ద్వారా రాజశేఖర్ దీనగాథ ను ప్రచారం చేయగా స్పందించిన మానవతా హృదయాలు గూగుల్ పే ద్వారా రూపాయల 30,000 పంపగా ఇట్టి డబ్బులను చందుర్తి సిఐ మొగిలి రాజశేఖర్ భార్య మాధవి, తల్లి భారతవ్వ కు అందజేశారు, ఈ సందర్భంగా సిఐ మొగిలి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజశేఖర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కోమా లోకి వెళ్లడం బాధాకరమని దాతలు స్పందించి ఇప్పటివరకు 'నా కలం అక్షర సత్యం, ఫేస్బుక్ ద్వారా సుమారు రెండు లక్షల యాభై వేలు విరాళాలు అందజేయడం అభినందనీయమన్నారు, ఇంకా దాతలు ముందుకు వచ్చి రాజశేఖర్ కు ఆర్థిక సాయం అందించాలని సీఐ కోరారు, రాజశేఖర్ గౌడ్ కు ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేసిన నా కలం అక్షరసత్యం ఫేస్బుక్ సభ్యులను సీఐ అభినందించారు,ఈ కార్యక్రమంలో నా కలం అక్షర సత్యం టీం సభ్యులు లింగంపల్లి గంగాధర్, శేఖర్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు గొట్టే మనోహర్ తదితరులు పాల్గొన్నారు,

## పల్లా శ్రీనివాసరావు దీక్షకు సబ్బం హరి మద్దతు

### -చీకటి ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్

విశాఖపట్టణం,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆమరణ దీక్ష చేస్తున్న టీడీపీ సీనియర్ నేత పల్లా శ్రీనివాస రావుకు మాజీ ఎంపీ సబ్బం హరి సంఘీభావం తెలిపారు. సోమవారం దీక్షస్థలికి వెళ్లిన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన చీకటి ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ బయటకు రావాలని .. నిజానిజాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర పెద్దలకు స్వలాభం ఉందన్న అనుమానా లను ఆయన వ్యక్తం చేశారు. అసలు విషయం చెప్పక పోతే... సీఎం అంత రాక్షసుడు ప్రపంచంలో ఎవరూ ఉండరన్నారు. పల్లా శ్రీనివాసరావు కోసమే తాను ఇక్కడికి వచ్చానని, ఆయనతో కలిసి పని చేస్తానని, ఆయన ఆశయం కోసం, ఆయన ఆశయం నెరవేరడం కోసం, ఆయన తర్వాత దీక్షలో కూర్చుంటానంటూ ఉద్వేగానికి గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు ఇలాగే ఉంటే, ఉద్యమం ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు. శ్రీనుకు ఆరోగ్యం బాలేదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టీల్ ఎ÷-లాంట్‌తో పాటు శ్రీనివాస్‌ను కూడా రక్షించుకోవాలని కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# నేడు బాసరలో వసంతపంచమి వేడుకలు

## అక్షరాభ్యాసాలకు విస్తృతంగా ఏర్పాట్లు
## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి

బాసర,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంతపంచమి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆలయంలో జరిగే ప్రముఖ ఉత్సవాల్లో ఒక్కటైన ఈ ఉత్సవాలకు ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా సోమ, మంగళవారాలు కూడాకొనసాగనున్నాయి. మంగళవారం వసంతపంచమి పర్వదినాన సరస్వతీ అమ్మవారికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

ఈ వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. అమ్మవారి జయంతోత్సవంగా జరుపుకునే ఈ శుభ దినాల్లో తమ పిల్లలకు అక్షర శ్రీకారపూజలు జరిపించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరతున్నాతారు. మంగళవారం అక్షాభ్యాసాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఏటా వసంత పంచమి నాడు భక్తుల రద్దీ పోటెత్తుతుంది. ఆ రోజు ఉదయం 3 గంటల నుంచి అక్షర శ్రీకారపూజలు జరిపించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆలయంలో మూడుచోట్ల మండపాలను సిద్ధం చేశారు. వీఐపీల వలన సాధారణ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు మండపాలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయానికి మూడు వైపులా పార్కింగ్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుకుండా చర్యలు తీసుకున్నారు. దాదాపు 500ల మంది బందోబస్తులో వినియోగించేలా అధి కారులు సన్నాహాలు చేశారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా భక్తులకు దర్శనాలు, పూజలు జరిపించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి పేర్కొన్నారు.

వసంతపంచమిని పురస్కరించుకుని బాసర సరస్వతీ ఆలయం భారీగా అక్షరాభ్యాసాలకు సిద్ధమైంది. ఏటా మాఘశుద్ధ పంచమి అమ్మవారి జన్మదిన వేడుకలకు ఆలయం ముస్తాబైంది. వేదవ్యాసుడి సృష్టి అయిన బాసర ఆలయంలో వసంతపంచమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. పరమ పవిత్రమైన ఈ రోజున అమ్మవారి సన్నిధిలో గడిపేందుకు, దర్శించుకునేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు అశేషసంఖ్యలో భక్తులు బాసరకు తరలి వస్తారు. చిన్నారుల అక్షరాభ్యాసాలు భారీగా జరుగుతాయి. దక్షిణ భారతవనిలో నెలకొని ఉన్న ఏకైక సరస్వతీ ఆలయంలో కావడంతో అక్షరాభ్యాసాలకు భారీగా చిన్నారులు తరలిరానున్నారు. అమ్మవారి జన్మదిన వేడుకలతో ఇప్పటికే బాసర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. చిన్నారుల అక్షరశ్రీకారానికి దివ్యమైన ముహూర్తం కావటంతో బాసరలో భారీగా అక్షరాభ్యాసాలు జరుగనున్నాయి. దీంతో బాసర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఏటా మాఘమాసంలో వచ్చే శుద్ధపంచమిని వసంత పంచమిగా నిర్వహిస్తారు. ఈరోజునే శ్రీపంచమి, మదన పంచమిగా కూడా వ్యవహరిస్తారు. మంచిపనులకు, చిన్నారుల అక్షరాభ్యాసాలకు విశిష్టదినంగా భావిస్తారు. వేకువజామున ఆలయాన్ని తెరుస్తారు. మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవతో అమ్మవారి జన్మదిన వేడుకలకు, పూజ కార్యక్రమాలకు అంకురార్పణ జరుగుతుంది. అనంతరం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, నివేదన, మంగళహారతి నిర్వహిస్తారు. అభిషేక కార్యక్రమ అనంతరం అక్షరాభ్యాసాలు ప్రారంభమవుతాయి. రోజంతా ఆలయంలో కుంకుమార్చన పూజలు, చండీహవనం, వేదపారాయణాలు జరుగుతాయి. వసంత పంచమి ఉత్సవంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం నుంచే భక్తులు బాసరకు తరలివచ్చారు. ఇప్పటికే బాసరలోని ఆలయ వసతిగృహాలు, ప్రైవేట్ లాడ్జ్‌లు ముందస్తు బుకింగ్‌లతో భక్తులకు ఆతిథ్యం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఉత్సవ నిర్వహణలో లోటుపాట్లు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేస్తున్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో అధికారులు అప్రమత్తులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టారు.

# వేడెక్కిన పశ్చిమ బెంగాల్ రాజకీయాలు

నేడు పశ్చిమ బెంగాల్ వీధి వీధిన 'జై శ్రీరామ్', 'జై బంగ్లా', 'జై సోనార్ బంగ్లా' నినాదాల హోరులే. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల నగారా అధికారికంగా మోగక ముందే ప్రచారపర్వం ఊపందుకుంది. జై శ్రీరామ్, జై బంగారు బంగ్లా మరియు భారత్ మాతాకీ జై నినాదాలు ఒక వైపున మరియు 'జై బంగ్లా', 'జై లోకల్ నాయకత్వం' పిలుపులు మరో వైపున ఎన్నికల వేడిని రగిలిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ జయంతి 'పరాక్రమ దివస్' సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీల మధ్య నెలకొన్న నిశ్శబ్దమే భాజపా మరియు తృణముల్ పార్టీల విభేదాలను/వైరాలను బహిర్గత పరిచినట్లు అయ్యింది. పార్టీల మధ్య సిద్ధాంత విభేదాలు ఎన్ని ఉన్నా ఒక దేశభక్తి పరుడి జయంతిలో అగ్ర నాయకులు సంయమనం పాటించాల్సి ఉండి ఉంటే బాగుండేదని సాధారణ పౌరుల అభిప్రాయం. కలకత్తా విక్టోరియా మెమోరియల్ వద్ద జరిగిన నేతాజీ జయంతి వేడుకల్లో దేశ ప్రధాని సందేశం ఇచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడక పోవడం నేతాజీని అవమానించినట్లుగా ఉందని కొందరు అంటే మరి కొందరు భాజపాపై ఉన్న కోపం కారణమే కావచ్చు అని అనుకుంటున్నారు. జై హింద్ మరియు భారత్ మాతాకి జై అని ప్రతి ఒక్కరు సగర్వంగా నినదించడానికి బదులు, ఆ నినాదాలను భాజపాకు మాత్రమే ఆపాదించడం విచారకరంగా ఉందని పౌరసమాజం భావిస్తున్నది. శ్రీ రాముడు హిందవులందరి ఆత్మ బంధువు, ఆరాధ్య పురుషోత్తముడు. జై హింద్ నినాదం మన నరనరాల్లో ఉత్తేజాన్ని ఇవ్వాల్సిన జాతి మంత్రం. వీటిని ఏ ఒక్క పార్టీకి ఆపాదించడం దేశ శ్రేయస్సుకు విఘాతమే అవుతుందని గమనించాలి.

1947 దేశవిభజన సమయంలో అవిభాజ్య బెంగాల్‌ను ఈస్ట్ పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో కలిపే ముస్లిమ్ లీగ్ దురాలోచన (కమ్యునిష్టుల పరోక్ష మద్దత్తుతో) కూడా చరిత్ర చవిచూడడం మనం ఇంకా మరిచి పోలేదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. అదే జరిగి ఉంటే నేడు హిందూవులు అధికంగా ఉన్న కలకత్తాలో పాటు పశ్చిమ బెంగాల్ కూడా బంగ్లాదేశ్‌లో కలిసి ఉండేదనేది వాస్తవం. నాటి 1941 జనాభా గణాంకాల ప్రకారం అవిభాజ్య బెంగాల్‌లో 41.20 శాతం హిందువులు మరియు 55.65 శాతం ముస్లిమ్‌లు ఉన్నారు. డా: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ లాంటి అనేక ప్రముఖ నాయకుల చొరవతో మెజారిటి హిందూ సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని పశ్చిమ బెంగాల్ ప్రాంతాన్ని ఒక రాష్ట్రంగా ఇండియాలో అంతర్భాగంగా ఏర్పాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోకి బంగ్లాదేశ్ జనులు 2216.7 కిమీ సరిహద్దులగుండా అక్రమంగా చొరబడడం భారత ప్రభుత్వానికి పెద్ద సమస్యగా నిలుస్తున్నది. గతంలో పాఠశాలల్లో జరిగే భారత దేశీయ క్రీడలైన కుస్తీ, కర్రసాము మరియు ఇతర శారీరక దారుఢ్య క్రీడలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు తొలగించడం కూడా దేశభక్తులను విస్మయానికి గురి చేసింది. భారతదేశంలోకి నేడు కూడా అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయుల్ని ఓటర్లుగా చూడడం దేశానికి పట్టిన దౌర్భాగ్యంగా భావిస్తున్నారు. ఇలాంటి స్వార్థపూరిత నాయకుల చర్యలు ఇలాగే కొనసాగితే పశ్చిమ బెంగాల్ రాష్ట్రం క్రమంగా సామాజిక-సాంస్కృతిక-రాజకీయంగా ప్రత్యేక సమస్యాత్మక ప్రాంతంగా మారడం ఖాయంగా తోస్తున్నది. రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రధాన అంశాలుగా కులమతాలకు అతీతంగా సకల జనుల సంక్షేమం మరియు సుస్థిరాభివృద్ధే నినాదం కావాలని కోరుకుందాం. భాజపా పక్షాన అమిత్ షా నాయకత్వంలో బంగారు పశ్చిమ బెంగాల్‌ను కాషాయమయం చేయడానికి, మమతా బెనర్జీ బంధుప్రీతి గల పార్టీ అని, తృణముల్ పాలనకు చరమగీతం పాడటానికి ముమ్మర ప్రయత్నాలు ఊపందుకున్నాయి. తృణముల్ పార్టీకి చెందిన మంత్రులు, యంపీలు మరియు యంయల్‌ఏలు రాజీనామా చేస్తూ భాజపా తీర్థం తీసుకోవడం మమతాను ఇరకాటంలోకి నెట్టిందని విశ్లేషిస్తున్నారు.

భాజపా స్థానిక పార్టీ కాదని, నాన్-లోకల్ పార్టీని వ్యతిరేకించాలని, జై బంగ్లా అంటూ మమతా దీదీ ఎదురుదాడి చేస్తున్నారు. ఈ రసవత్తర కమలం, గడ్డిపూలకు మధ్య జరిగే బ్యాలెట్ సమరంలో ఎవరిది పైచేయి అవుతుందో త్వరలోనే తెలుతుంది. భాజపా మరియు తృణముల్‌లలో ఎవరు గెలిచినా ప్రజాస్వామ్యం మాత్రం ఓటమి పాలు కాకూడదని కోరుకుందాం



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# తెలంగాణ తలెత్తుకుని నిలబడేలా చేసిన కెసిఆర్

## కెసిఆర్ బర్త్‌డే రోజు మొక్కలు నాటుదాం
## చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ పిలుపు

వరంగల్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కెసిఆర్ విధానాల వల్లనే తెలంగాణ ఇవాళ తలెత్తుకుని సగర్వంగా నిలిచిందని కేసీఆర్‌కు ప్రతిఒక్కరైతు రుణపడి ఉంటారని చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ అన్నారు. కెసిఆర్ బర్త్‌డే సందర్భంగా ఆయనకు కృతజ్ఞతగా అంతా కలసి మొక్కలు నాటాలన్నారు. ఇదే కెసిఆర్‌కు ఇచ్చే కానుకని అన్నారు. ఎంపి సంతోష్ చేపట్టిన కోటి వృక్షార్చనలో భాగస్వాములం కావాలన్నారు. తెలంగాణలో చేస్తున్న అభివృద్దిని బిజెపి నేతల తమ పాలిత రాష్ట్రాల్లో చేసి చూపాలన్నారు. కేవలం విమర్శలతో పబ్బం గడుపుకోవద్దన్నారు. గత పాలకుల హయాంలో వ్యవసాయం దండుగ అన్న రైతులు నేడు వ్యవసాయం పండుగ అనేలా చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్క రైతు రుణపడి ఉంటారని చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ అన్నారు. కమిషన్లకు కక్కుర్తిపడి, ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వకుండా లక్షకోట్లు ఖర్చుపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే అని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్నిరకాల పథకాలు అమలు చేస్తున్న ఏకైక సిఎం కెసిఆర్ అన్నారు. కెసిఆర్ బర్త్‌డే సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. హరితహారంతో తెలంగాణ పచ్చగా మారిందన్నారు. మరోమారు పెద్ద ఎత్తున మొక్కలు నాటి కెసిఆర్‌కు కానుకగా ఇద్దామని పిలుపిచ్చారు. రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ఏ దేశంలో, ఏ రాష్ట్రంలోని లేని విప్లవత్మాకమైన పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్,బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రారంభించాలన్నారు. రైతులపై ప్రేమ ఒలకబోస్తున్న బిజెపి వారు చేసి చూపాలన్నారు. పేదింట్లో ఆడపిల్ల పుట్టిందంటే, ఆ పిల్ల పెళ్లీడుకు వచ్చిందంటే తల్లిదండ్రులకు భయం. పేదింట్లో గర్భిణీ అయిన తర్వాత కూడా ప్రసవం వరకు పనిచేయకపోతే గడవని పరిస్థితిని గమనించిన సిఎం కేసీఆర్ గర్భిణీ స్త్రీలకు గర్భం దాల్చిన మూడు నెలలు, ప్రసవం తర్వాత మరో మూడు నెలల పాటు నెలకు 2వేల రూపాయల చొప్పున 12వేల రూపాయలు, ఆడపిల్ల పుడితే ప్రత్యేకంగా మరో వెయ్యి రూపాయలు కలిపి 16వేల రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా జాన్సన్ అండ్ జాన్సన్ వంటి గొప్ప కంపెనీ తయారు చేసిన 15 రకాల ఉత్పత్తులతో కేసిఆర్ కిట్ ఇస్తున్నారని చెప్పారు. ప్రసవం ముందు, తర్వాత డబ్బులు ఇస్తూ, పిల్లలకు, తల్లికి వస్త్రాలు, కేసిఆర్ కిట్ ఇచ్చి అమ్మ ఒడి వాహనంలో ఇంటి దగ్గర దించుతున్న ఏకైక ప్రభుత్వం దేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒకటేనని తెలిపారు. సంక్షేమ పథకాల్లో తెలంగాణ ప్రభుత్వం దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు.రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పూర్తయితే కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వ్యవసాయం బాగుండాలంటే భూములు, నీళ్లు, కరంటు ఉండాలని చెప్తూ.. ఇప్పటికే రికార్డుల ప్రక్షాళన పూర్తయిందని, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీనికితోడు నుంచి పంట పెట్టుబడి కూడా అందిస్తున్నామని చెప్పారు.

# ఇంగ్లండ్ ముందు 482 పరుగుల టార్గెట్



## సెంచరీతో అశ్విన్..అర్ధ సెంచీతో విరాట్ పునాది
## రెండో ఇన్నింగ్స్‌లో 329 పరుగుల చేసిన టీమిండియా

రెండో రోజు ఆటలో ఇంగ్లండ్‌ను 134 పరుగులకే కట్టడిచేసిన సంగతి తెలిసిందే. అయితే, రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలినా అశ్విన్ సెంచరీ(106), కెప్టెన్ కోహ్లి అర్ధసెంచరీ(62)తో 286 పరుగులు చేయగలిగింది. తద్వారా ఇంగ్లండ్ 482 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా స్టార్ స్పిన్నర్ అశ్విన్ అద్భుత సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో భాగంగా బౌండరీ బాది శతకం పూర్తి చేసుకున్నాడు. మొయిన్ అలీ బౌలింగ్‌లో వరుస బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి సొంత మైదానంలో మ్యాచ్‌ను మరింత ప్రత్యేకంగా మలచుకున్నాడు. 103 పరుగులతో అతడు క్రీజులో ఉన్నాడు. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్న విరాట్ కోహ్లి (149 బంతుల్లో 62; 7ఫోర్లు) ఏడో వికెట్‌గా ఔటయ్యాడు. మొయిన్ అలీ బౌలింగ్‌లో కోహ్లి ఎల్బీగా వెనుదిరిగాడు.

ఏడో వికెట్‌గా క్రీజులోకొచ్చిన అశ్విన్ కోహ్లితో కలిసి జట్టును ఆదుకున్నాడు. ఓలీ స్టోన్ బౌలింగ్‌లో బౌండరీ బాదడం ద్వారా అశ్విన్ (65 బంతుల్లో 50; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

వెనువెంటనే వికెట్లు తీసి టీమిండియాకు చెమటలు పట్టించిన ఇంగ్లండ్ స్పిన్నర్లను విరాట్ కోహ్లి, రవిచంద్రన్ అశ్విన్ సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

చెన్నై,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ఇంగ్లండ్‌తో చెపాక్ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా పటిష్ట స్థితిలో నిలిచింది. 286 పరుగులతో రెండో ఇన్నింగ్స్‌ను ముగించిన కోహ్లి సేన, పర్యాటక జట్టు కంటే 481 పరుగుల ఆధిక్యంలో ఉంది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో 329 పరుగులు చేసిన భారత జట్టు.. స్పిన్నర్ల మాయాజాలంతో

# చేపాక్‌లో అశ్విన్ అద్భుత సెంచరీ

## ఐదు వికెట్లు..సెంచరీతో బోథమ్ తరవాతి స్థానం
## 35 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో శతకం

చెన్నై,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ అదుర్స్ అనిపించాడు. తొలుత అటు బౌలింగ్‌లోనూ రాణించిన అశ్విన్.. ఆపై బ్యాటింగ్‌లో కూడా రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శతకం సాధించి శభాష్ అనిపించాడు. 135 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో అశ్విన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇది అశ్విన్‌కు టెస్టుల్లో ఐదు సెంచరీ. సోమవారం మూడో రోజు ఆటలో భాగంగా కోహ్లితో కలిసి 96 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని సాధించి జట్టు స్కోరును గాడిలో పెట్టిన అశ్విన్.. అటు తర్వాత శతకంతో మెరిశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నప్పటికీ అశ్విన్ మాత్రం ఆత్మవిశ్వాసంతో ఆడి వీరోచిత సెంచరీ సాధించాడు.

రిముందుగా హాఫ్ సెంచరీని ఆడుతూ పాడుతూ పూర్తి చేసుకున్న అశ్విన్ దాన్ని సెంచరీగా మలుచుకున్నాడు. ఒకానొక సమయంలో అశ్విన్ సెంచరీ చేస్తాడా.. లేదా అనే సందిగ్ధం నెలకొంది. కాగా, పదకొండో బ్యాట్స్‌మన్‌గా క్రీజ్‌లోకి వచ్చిన సిరాజ్‌ను జాగ్రత్తగా ఆడిస్తూనే మరొకవైపు సెంచరీ నమోదు చేశాడు. మొయిన్ అలీ వేసిన ఇన్నింగ్స్ 82 ఓవర్ ఐదో బంతికి ఫోర్‌తో శతకాన్ని సాధించాడు అశ్విన్. ఇది ఇంగ్లండ్‌పై అశ్విన్‌కు తొలి టెస్టు సెంచరీ కాగా, అంతకుముందు చేసిన నాలుగు సెంచరీలు వెస్టిండీస్‌పైనే సాధించాడు. అశ్విన్ సెంచరీ పూర్తి చేయడంతో అరుదైన జాబితాలో చేరిపోయాడు. ఒక టెస్టు మ్యాచ్‌లో ఐదు వికెట్లను, సెంచరీని అత్యధికంగా సాధించిన ఆటగాళ్లలో రెండో స్థానంలో నిలిచాడు. ఒక టెస్టు మ్యాచ్‌లో ఐదు వికెట్లను, సెంచరీని అత్యధికంగా సాధించిన జాబిజాతాలో ఇయాన్ బోథమ్(ఇంగ్లండ్ మాజీ ఆల్ రౌండర్) ముందు వరుసలో ఉన్నాడు. ఈ ఘనతను బోథమ్ ఐదుసార్లు సాధించగా, ఆ తర్వాత స్థానాన్ని అశ్విన్ ఆక్రమించాడు. అశ్విన్ ఈ ఫీట్‌ను మూడుసార్లు సాధించాడు. ఈ క్రమంలోనే గ్యారీ సోబర్స్, ముస్తాక్ అహ్మద్, జాక్వస్ కల్లిస్, షకిబుల్ హసన్‌లను వెనక్కి నెట్టాడు. వీరంతా దీన్ని రెండుసార్లు మాత్రమే సాధించారు. అశ్విన్ 148 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్‌తో 106 పరుగులు సాధించి చివరి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. భారత తన రెండో ఇన్నింగ్స్‌ను 286 పరుగుల వద్ద ముగించగా, 481 పరుగుల ఓవరాల్ ఆధిక్యం లభించించింది. ఫలితంగా ఇంగ్లండ్ 482 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగనుంది.

# టీమిండియాపై ఇమ్రాన్ ప్రశంసలు

## ప్రపంచంలోనే అగ్రశ్రేణి జట్టని కితాబు

కరాచీ,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ ప్రధానమంత్రి, మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్.. టీమిండియాపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత జట్టు ప్రపంచ శ్రేణి జట్లలో అగ్రశ్రేణి జట్టని కొనియాడారు. భారత్‌లో ప్రాథమిక క్రికెట్ మౌలిక సదుపాయాలను కావల్సినంతగా మెరుగుపరచడంతో భారతదేశం ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లలో ఒకటిగా మారుతోందని అభిప్రాయపడ్డారు. అయితే, పాకిస్తాన్ కూడా మంచి జట్టే అని, అయితే ఉత్పదకత లేని క్రికెట్ కారణంగా వెనకబడి పోతున్నదని చెప్పారు. చెన్నైలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో అద్భుతంగా రాణిస్తున్న టీమిండియా ప్రదర్శనను వీక్షించిన ఇమ్రాన్‌ఖాన్ సోమవారం నాడు ఇస్లామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'ఇవాళ భారతదేశాన్ని చూడండి. వారు ప్రపంచంలోనే అగ్రశ్రేణి జట్టుగా మారుతున్నారు. ఎందుకంటే వారు తమ క్రికెట్ నిర్మాణాన్ని మెరుగుపరుచుకున్నారు. అయినప్పటికీ, వారి కంటే మా దేశ క్రికెటర్లకే ఎక్కువ ప్రతిభ ఉన్నది. అయితే, ఉత్పాదకత ఇచ్చే నిర్మాణం జరిగినప్పుడే ఫలితం పొందుతాం' అని అన్నారు. భారత్‌లో క్రికెట్ ఆటకు సంబంధించి అన్ని రాష్ట్రాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నందునే వారు అగ్రశ్రేణి జట్టుగా మారుతున్నారన్నారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌లో క్రికెటర్లు చాలా ప్రతిభ కలిగి ఉన్నారని, అయితే ఉత్పాదకత లేని క్రికెట్ నిర్మాణం కారణంగా ప్రపంచంలో అత్యుత్తమ జట్టుగా అవతరించడం లేదని ఇమ్రాన్‌ఖాన్ విచారం వ్యక్తం చేశారు. ప్రతిభను ప్రకాశవంతం చేయడానికి సమయం పడుతున్నదని, తమ దేశ జట్టు ప్రపంచ విజేతగా మారుతుందనే నమ్మకం తనకున్నదన్నారు. దేశంలో ఇప్పుడు ప్రావిన్షియల్ క్రికెట్ నిర్మాణంతో ఫలితాలు రెండు, మూడు సంవత్సరాలలో వస్తాయని ప్రధాని ఇమ్రాన్ అభిప్రాయ పడ్డారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు పోషకుడిగా, ఛైర్మన్‌గా ఉన్న ఇమ్రాన్‌ఖాన్.. తన బిజీ షెడ్యూల్ కారణంగా ఆటకు ఎక్కువ సమయం కేటాయించ లేకపోతున్నట్లు చెప్పారు. పాకిస్తాన్ జట్టు దాదాపు దశాబ్దం క్రితం వరకు అగ్రశ్రేణి జట్టుగా ఉండేది. కాని ప్రస్తుతం అత్యుత్తమ జట్టు మాదిరిగా ఉండకపోవడం పాకిస్తానీయులను కలవరపెడుతున్నది. ప్రపంచ కప్‌లో భారతదేశంపై పాకిస్తాన్ జట్టు ఇంతవరకు ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది.

# కోటి వృక్షార్చనలో పాల్గొందాం: నటి రోజా

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కోటి వృక్షార్చనలో పాల్గొని సీఎం కేసీఆర్‌కు హరిత కానుక అందిద్దామని నటి, ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే రోజా అన్నారు. ఈ నెల 17 న ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో పాల్గొందామని, ఒక గంటలో ఒక కోటి మొక్కలు నాటుదామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు కోటి వృక్షార్చన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేద్దామని చెప్పారు

# అడిషనల్ డిసిపి చంద్రమోహన్ డిజిపి కమెండేషన్ సర్టిఫికెట్‌కు ఎంపిక

కరీంనగర్, ఫిబ్రవరి 15: (నేటినిజం ప్రతినిధి): అసాధారణమైన సేవలకుగాను రాష్ట్ర డిజిపి అందించే కమెండేషన్ సర్టిఫికెట్‌నకు కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ ఎంపిక య్యారు. గత ఫిబ్రవరి 28నుండి అక్టోబర్ 06వరకు ఆరునెలపాటు కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల(పిటిసి)కు ఇంఛార్జి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలను నిర్వహించి విజయవంతంగా 2020బ్యాచ్‌నకు చెందిన కానిస్టేబుళ్ళ శిక్షణను పూర్తిచేయించడంతోపాటు అనుహ్యరీతిలో పిటిసి ఆవరణను వివిధ రకాల నిర్మాణాలతో అభివృద్ధి చేయడంతోపాటు పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి సహకారంతో హరితహారంలో దాదాపు 26వేల మొక్కలను నాటి పరిరక్షించినందుకుగాను ఆయను ఈ కమెండేషన్ సర్టిఫికెట్‌నకు డిజిపి ఎంపిక చేశారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమి (టిఎస్‌పిఏ), తెలంగాణస్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, ఎఫ్ఏసి(ట్రినింగ్)గా కొనసాగుతున్న అడిషనల్ డిజిపి వివి శ్రీనివాసరావు అడిషనల్ డిసిపి జి చంద్రమోహన్‌ను ఈ కమెండేషన్ సర్టిఫికెట్‌నకు ఎంపికచేసేందుకు ప్రతిపాదనలు పంపారు. సదరు ప్రతిపాదనలు అంగీకరిస్తూ డిజిపి ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. సదరు సర్టిఫికెట్‌ను సోమవారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

తనసేవలకు గుర్తింపు లభించడం ద్వారా డిజిపి కమెండేషన్ సర్టిఫికెట్‌నకు ఎంపికకావడం నాలో బాధ్యతలను మరింతపెంచిందని, ఇందుకు పిటిసి వివిధ రకాల విభాగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధానంగా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి సహకారం అందించి వెన్నుతట్టి ప్రోత్సహించారని అడిషనల్ డిసిపి జి చంద్రమోహన్ అన్నారు. తాను ఈ డిజిపి కమెండేషన్‌కు ఎంపికకావడానికి ప్రతిపాదనలు పంపించిన వివి శ్రీనివాస రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**సాంకేతిక నైపుణ్యతను పెంపొందించేందుకు మహిళాపోలీసులకు శిక్షణ**

మహిళల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మూడురోజులపాటు నిర్వహించతలపెట్టిన శిక్షణ కార్యక్రమం సోమవారంనాడు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో ప్రారంభమైంది. శిక్షణలో భాగంగా సిసిటిఎన్ఎస్, హెచ్ఆర్‌యంఎస్, సైబర్‌నేరాలు, టిఎస్‌కావ్ యాప్ వినియోగం, ఈ-చలాన్లు, ఈ-పెట్టీకేసుల నమోదు, అత్యాధునికంగా అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల సాంకేతికతను వినియోగించడం, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ కొనసాగుతున్నది.

ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ మాట్లాడుతూ అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కలిగిఉండాలన్నారు. టెక్నాలజీవస్తున్న మార్పులను అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. టెక్నాలజీ వినియోగం కీలకపాత్రపోషిస్తుందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. అన్నిస్థాయిలకు చెందిన పోలీసులకు టెక్నాలజీ వినియోగంపై శిక్షణ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నామని తెలిపారు.

# మయూరాక్షి పాటలు విడుదల



'భాగమతి' ఫేం ఉన్ని ముకుందన్ హీరోగా మియా జార్జ్ హీరోయిన్‌గా మలయాళంలో రూపొందిన 'ఐరా' అనే సూపర్ హిట్ చిత్రాన్ని 'మయూరాక్షి' పేరుతో శ్రీ శ్రీ శ్రీ శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై తెలుగులోకి అనువదిస్తున్నారు. యువ నిర్మాత వరం జయంత్ కుమార్ ఈ ప్రాజెక్టును చేపట్టారు.

సూపర్ హిట్ చిత్రాల సంగీత దర్శకుడు గోపీసుందర్ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలోని పాటలను సోమవారం ప్రసాద్ ల్యాబ్స్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాతలు కె.అచ్చిరెడ్డి, శివలెంక కృష్ణ ప్రసాద్ బిగ్ సీడీని ఆవిష్కరించారు.

సందర్భంగా ఎస్వీ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ మిస్టరీతో కూడిన ఈ థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటూనే ఉంటుంది. ఈ సినిమా కూడా విజయం సాధించి యువ నిర్మాత వరం జయంత్ కుమార్ కు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ...పాటలు, ట్రైలర్ ఇంప్రెసివ్‌గా ఉన్నాయి. థ్రిల్లర్ చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. ఆ కోవలో ఈ చిత్రం కూడా పెద్ద సక్సెస్ సాధించి నిర్మాతకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నా అని అన్నారు. ప్రముఖ నిర్మాత కె.అచ్చిరెడ్డి మాట్లాడుతూ మార్చి 19న విడుదలకు సిద్ధమవుతోన్న ఈ చిత్రం ఘన విజయం సాధించాని కోరుకుంటున్నానని అన్నారు. నిర్మాత వరం జయంత్ కుమార్ మట్లాడుతూ సస్పెన్స్ రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందింది. ఉన్ని ముకుందన్, మియా జార్జ్ నటన, గోపీసుందర్ మ్యూజిక్ సినిమాకు హైలెట్స్. మార్చి 19న థియేటర్స్ లోకి రాబోతున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నానని అన్నారు.

# లవ్‌స్టోరీ పాట విడుదల



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్‌స్టోరి'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై కె.నారాయణదాస్ నారంగ్, పి.రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఆదివారం ఈ చిత్రంలోని 'నీ చిత్రం చూసి నా చిత్తం చెదిరి' అనే పాటను విడుదలచేశారు. అనురాగ్ కులకర్ణి ఆలపించిన ఈ గీతానికి మిట్టపల్లి సురేందర్ సాహిత్యాన్ని సమకూర్చారు. పవన్ సీహెచ్ సంగీతాన్ని అందించారు. పురాణ పూల్, తారామతి బారాదారి లాంటి ప్రేమ చిహ్నాలను మోషేదయాన్ పెయింటింగ్స్ ద్వారా చూపిస్తూ శ్రావ్యమైన బాణీలతో పాట కనుల విందుగా ఉంది. నిర్మాతలు మాట్లాడుతూ 'రేవంత్, మౌనిక అనే జంట ప్రేమపయనంలోని మధుర భావాలకు అద్దం పడుతూ తెరకెక్కుతున్న చిత్రమిది. సహజమైన ఉద్వేగాలతో ఆహ్లాదభరితంగా ఉంటుంది. ఏప్రిల్ 16న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. రాజీవ్ కనకాల, ఈశ్వరీరావు, దేవయాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్.సి.కుమార్.

# తదుపరి చిత్రం కోసం రెడీ అవుతున్న రామ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన తదుపరి సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి 'రెడ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రామ్.. నెక్ట్స్ ఏ మూవీ చేస్తాననే దానిపై ఇంత వరకు క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఓ కోలీవుడ్ దర్శకుడితో కలిసి సినిమా చేయబోతున్నట్లు సమాచారం. ఇంతకీ రామ్ ఓకే చెప్పిన ఆ దర్శకుడు ఎవరో కాదు.. లింగుస్వామి. ఈ కోలీవుడ్ దర్శకుడు తెరకెక్కించిన పందెంకోడి సినిమా తెలుగులోనూ మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. తర్వాత లింగుస్వామి తెలుగు హీరోతో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేయడానికి ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.ఆ మధ్య స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్‌తోనూ ఓ సినిమా చేయడానికి ఆయన సిద్ధమైన సంగతి తెలిసిందే. కానీ ఆ ప్రాజెక్ట్ ఎందుకనో రూపుదిద్దుకోలేదు. కాగా.. ఇప్పుడు రామ్‌తో లింగుస్వామి సినిమా చేయనుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలోనూ రూపొదుతుందనడంలో సందేహం లేదు.

# కుటుంబ సమేతంగా దర్శించుకున్న బిగ్ బాస్ గంగవ్వ



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 15 : (నేటినిజం ప్రతినిధి):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని బిగ్ బాస్ ఫేమ్ గంగవ్వ, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు గంగవ్వ కు ఆశీర్వచనం చేయించి ఆశీర్వాదం ఇచ్చారు.

# పెట్రో ధరలతో మోయలేని భారం: తులసిరెడ్డి

విజయవాడ,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ): కేంద్రంలో బీజేపీ, ఏపీలో వైసీపీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలొచ్చాయని ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వాహనదారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారాన్ని వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ ధర సెంచరీకి, వంట గ్యాస్ ధర త్వరలోనే పది సెంచరీలకి చేరువకానుందని చెప్పారు. ధరల పెంపుపై ప్రజలపై భారీ భారాలు పడుతున్నాయని మండిపడ్డారు. నాలుగు నెలల వ్యవధిలో నాలుగు దఫాలుగా వంట గ్యాస్ ధరను రూ.175లకు అమాంతంగా పెంచేశారని ధ్వజమెత్తారు.కేంద్ర బ్జడెట్‌లో పెట్రోల్‌పై రెండున్నర, డీజిల్‌పై నాలుగు రూపాయలు, అగ్రి ఇన్ ఫ్రాసెస్‌ను విధించిందన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.